
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సాయంత్రం విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం శ్రీ మహా చండీదేవి అలంకారంలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మ వారి దివ్య దర్శనం, వేద ఆశీర్వచనం చిత్రం
– విజయవాడ,అక్టోబర్ 14 (వార్తాప్రభ):


| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 177 | ది.15-10-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 177 | Date : 15-10-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |


## భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనస్వాగతం

**● రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు..**



**గన్నవరం,అక్టోబర్ 14 (వార్తాప్రభ):** బుధవారం సాయంత్రం 6:10 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పలు కార్యక్రమాలలో పాల్గొను నిమిత్తం గన్నవరం చేరుకున్న రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ తో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, రాష్ట్ర గనులు, భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రహోం, విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు భారత రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి భద్రత బలగాల నడుమ ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

## వివాహ వేడుకకు హాజరైన వైయస్ జగన్



**విజయనగరం, అక్టోబర్ 14 (వార్తాప్రభ) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ విజయనగరం జిల్లా భోగాపురంలో పర్యటించారు. భోగాపురంలోని సన్ రే విలేజ్ రిసార్ట్‌లో జరిగిన వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఉప్పాడ శివారెడ్డి వివాహ వేడుకకు వైయస్ జగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు తనూజ--శివారెడ్డిలను ఆశీర్వదించి, వారికి హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో ఆనందమయమైన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల

**● తొలి దశ నవంబర్ 26న పోలింగ్ ● మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికలు ● మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 28న ● మున్సిపల్ ఫలితాలు ఈ నెల 30న ● ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3న**



**అమరావతి, అక్టోబర్ 14 (వార్తాప్రభ) :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. 10 నగర పంచాయతీలు, 77 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లకు ఎన్నికల నోటిఫికేషన్‌ను అధికారులు విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికలకు ఈ నెల 28న పోలింగ్, 30న ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుందని, 19 నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

**ఎంపీటీసీ, జడ్పీటీసీలకు నోటిఫికేషన్..** ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఈ నెల 19న నోటిఫికేషన్ విడుదలకానుందని తెలిపారు. 23న నామినేషన్లకు చివరి తేదీ కాగా.. 24న పరిశీలన, 27న ఉపసంహరణ ఉంటుందని, నవంబర్ 3న ఎన్నికలు, 5న ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

**మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు..** ఇక పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 26న ఫేజ్-1, 29న ఫేజ్-2, డిసెంబర్ 2న ఫేజ్-3 ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీలకు ఎన్నికలు జరిగిన రోజే ఫలితాలు విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వరుల నాల్గవ రోజు దివ్య నగరోత్సవం

**● శ్రీ మహాచండీ దేవి అలంకార శోభలో ప్రదోషవేళ కనులపండువగా ఆదిదంపతుల రథయాత్ర**
**● మంగళవాయిద్యాల నడుమ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించిన ఈవో వి.కె. శీనా నాయక్**
**● శాక్సోఫోన్ వాయిద్యాలు, కేరళ మేళం, భక్తజనుల కోలాటాలు, గరగ నృత్యాల కోలాహలం**
**● రాజగోపురం ముంగిట ఉత్సవ మూర్తులకు విశేష పూజలు -- భక్తిపారవశ్యంతో కర్పూర నీరాజనాలు పలికిన భక్తకోటి**





**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 14 (వార్తాప్రభ):** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో నాల్గవ రోజైన బుధవారం సాయంత్రం ఆదిదంపతులైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల పవిత్ర నగర రథోత్సవం ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా జరిగింది. ఇంద్రకీలాద్రి శిఖరాన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు దుష్టశిక్షణ, శిష్టరక్షణకారిణి అయిన శ్రీ మహాచండీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమిస్తుండగా, పరమ పవిత్రమైన ప్రదోషకాల సమయంలో కొండపై కొలువుదీరిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు అర్చక బృందం శాస్త్రోక్తంగా విశేష పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ సంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి నగరోత్సవ రథయాత్రను ప్రారంభించి, స్వయంగా రథోత్సవంలో పాల్గొన్నారు. నగరోత్సవ రథం ముందుకు సాగుతుండగా నాదస్వరాలు, సన్నాయి మేళాలు, కేరళ పంచవాయిద్యాల దరువులు, శాక్సోఫోన్ మంగళనాదాలు భక్తులను పరవశింపజేశాయి. మహిళా భక్తుల లయాన్విత కోలాటాలు, జానపద కళారూపమైన గరగ నృత్య ప్రదర్శనలు ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. విద్యుద్దీపాలు, సుగంధ పుష్పమాలికలతో సర్వాంగసుందరంగా అలంకరించిన రథంపై అధిష్టించిన జగన్మాతను, పరమేశ్వరుడిని దర్శించుకునేందుకు మార్గమధ్యంలో వేలాది మంది భక్తులు బారులు తీరారు. భక్తులు కొబ్బరికాయలు సమర్పిస్తూ, ధూపదీప కర్పూర నీరాజనాలతో స్వామి, అమ్మవార్లను కీర్తిస్తూ భక్తిప్రపత్తులు చాటుకున్నారు. పురవీధులలో శోభాయమానంగా సాగిన దివ్య రథయాత్ర ఘనంగా తిరిగి ఇంద్రకీలాద్రి పైకి చేరుకుంది. ఆలయ రాజగోపురం ముంగిట ఉత్సవ రథాన్ని నిలిపి, వేద పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీ దుర్గా మల్లేశ్వరులకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, దివ్య మంగళ హారతులు సమర్పించారు. నవరాత్రుల వేళ ఆదిదంపతులు కొలువుదీరిన రథాన్ని దర్శించుకోవడం వల్ల సకల దోషాలు తొలగి, కుటుంబంలో శాంతిసౌఖ్యాలు, కార్యసిద్ధి చేకూరుతాయని భక్తుల విశ్వాసం. ఈ దివ్య మహోత్సవంలో ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు,ఆలయ ఉద్యోగులు, అశేష భక్తజనం పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలను పొందారు.

## గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు తెలంగాణ బెస్ట్ డెస్టినేషన్: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,అక్టోబర్ 14 (వార్తాప్రభ) :** ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణను అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉన్న తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్: 2047 విజన్ డాక్యుమెంట్'ను వివరిస్తూ, రాష్ట్రాన్ని మూడు ప్రధాన జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్న తమ ప్రణాళికను వెల్లడించారు. "2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 'క్యూర్ (CURE), ప్యూర్ (PURE), రేర్ (RARE) అనే మూడు జోన్లను అభివృద్ధి చేయాలని సంకల్పించాం" అని వివరించారు.

## జనసేన పార్టీలోకి వంగవీటి రాధాకృష్ణ

**● పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్**



**విజయవాడ, అక్టోబర్ 14 (వార్తాప్రభ) :** దివంగత నేత స్వర్గీయ శ్రీ వంగవీటి మోహన రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ఈరోజు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో లిరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వంగవీటి రాధాకృష్ణ కి పవన్ కళ్యాణ్ స్వయంగా పార్టీ కండువా కప్పి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శ్రీ రాధాకృష్ణ తనతో వచ్చిన అనుచరులను పవన్ కళ్యాణ్ కి పరిచయం చేశారు. పార్టీ సిద్ధాంతాల కోసం, ప్రజా సేవలో కలిసికట్టుగా పని చేద్దామని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు.

# మీడియా స్వేచ్ఛను కాపాడుకుందాం

**● జర్నలిస్టు సంఘాల నాయకుల పిలుపు**
**● సంఘీభావంగా ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ సందేశం**




**విజయవాడ పశ్చిమ ,అక్టోబర్ 14 (వార్తాప్రభ) :** మీడియా స్వేచ్ఛను కాపాడుకునేందుకు జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఐక్యంగా పోరాటాలు చేయాలని పలు జర్నలిస్టు సంఘాలు పిలుపునిచ్చాయి. ఢిల్లీలో జర్నలిస్టులపై దాడిచేసిన, మహిళా జర్నలిస్టుల పట్ల విచక్ష?ణా రహితంగా ప్రవర్తించిన పోలీసులను అరెస్టు చేసి కఠినంగా శిక్ష?ంచాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటరులో బుధవారంనాడు జర్నలిస్టులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూఢిల్లీలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం, దాడులకు పాల్పడటం, నిర్బంధించడం, మహిళా జర్నలిస్టుల పట్ల అవమానకరంగా ప్రవర్తించటాన్ని జర్నలిస్టులు, సంఘాల ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు వల్లభనేని సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు మాట్లాడుతూ న్యూఢిల్లీలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేసేందుకు తెగబడిన పోలీసు వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలోని అక్రమాలను ప్రశ్నిస్తూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్దకు చేరుకుంటున్న ఉపాధ్యాయులు, రచయితలు, కార్మిక సంఘాల నాయకులు, వివిధ ప్రతిపక్ష పార్టీల ఆందోళన సమాచారాన్ని చేరవేసేందుకు వెళ్లిన వెళుతున్న జర్నలిస్టులపై ఆంక్షలు పెట్టి నిర్బంధించే ప్రయత్నం చేసిన పోలీసుల వైఖరి గర్హనీయమని పేర్కొన్నారు. మీడియా అని చెబుతున్నప్పటికీ వినకుండా పోలీసులు నిర్బంధించడమే కాక, దురుసు గా వ్యవహరించారన్నారు. అమరావతి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చిగురుపాటి సతీష్‌బాబు మాట్లాడుతూ జర్నలిస్టులపై వ్యవస్థీకృతంగా జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కల్గిస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులకు తెగపడటం బాధాకరమన్నారు. పాలకుల తీరు ద్వారా రాజ్యాంగ హక్కులు హరించిపోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వం జర్నలిస్టుల చట్టాలను రద్దుచేసి వాటిస్థానంలో కోడ్లను ప్రవేశపెట్టిందన్నారు. తద్వారా గతంలో ఉన్న హక్కులు నేడు హరించుకుపోయాయన్నారు. హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాల్సిందేనని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరాం యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై వివిధ రూపాల్లో నిర్బంధం కొనసాగుతుండటం బాధాకరన్నారు. ప్రజాస్వామ్యం నిలబడాలంటే జర్నలిజం బ్రతకాలన్నారు. ఐక్య ఉద్యమాలకు, మీడియా హక్కుల పరిక్షణ కోసం, ఐక్య పోరాటాలకు తాము సిద్ధంగా ఉంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూడా పలు జిల్లాలలో జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని, అదేవిధంగా జర్నలిస్టులపై అక్రమ కేసును బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిష్పక్షపాత జర్నలిజాన్ని వివిధ పార్టీల నాయకులు, అధికారులు సహించలేక బోగస్ కేసులు పెట్టడం పోలీస్ వర్గాలు కూడా కనీస ప్రాథమిక విచారణకు కూడా ఆలోచించకుండా జర్నలిస్టులపై కేసులు రిజిస్టర్ చేయడం దారుణమన్నారు. మీడియా ప్రతినిధులపై కేసులు కట్టే ముందు పోలీస్ అధికారులు ప్రాథమిక విచారణ చేసుకోవాలని, నిజాలను నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు పోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు నిజాన్ని నిర్భయం గా చెప్పే అవకాశం ఉందన్నారు. వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టుల పట్ల నిర్బంధాన్ని ప్రయోగిస్తే భవిష్యత్తులో చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. "ప్రజాశక్తి" దినపత్రిక ఎడిటర్ బి.తులసీదాస్ మాట్లాడుతూ సీఈసీ రాజీనామా, ఎస్ఐఆర్ రద్దు చేయాలంటూ జరుగుతున్న ఉద్యమం కవర్ చేస్తున్న జర్నలిస్టుల పైన ఢిల్లీ పోలీసులు దురుసుగా ప్రవర్తించడమే కాక తీవ్రంగా కొడుతుండటం, నిర్బంధాన్ని ప్రయోగిస్తుండటం అత్యంత దుర్మార్గమన్నారు. మహిళా జర్నలిస్టులను ఘోరంగా అవమానిస్తుంటం సభ్య సమాజానికే అవమానకరమన్నారు. ఇది మీడియా స్వేచ్ఛను హరించటమే కాకుండా పాత్రికేయుల విధి నిర్వహణకు తీవ్ర ఆటంకం కల్గించే చర్యేగా అభివర్ణించారు. ఢిల్లీ పోలీసు వైఖరికి నిరసనగా మరింత విస్తృతంగా ఆందోళలు సాగించాలని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తుచేశారు. ఈ ఆందోళనల్లో అన్ని జర్నలిస్టు సంఘాలు ఐక్య కార్యాచరణగా ముందుకు వెళ్లటం ఎంతైనా అవసరం వుందని వివరించారు. సీనియర్ జర్నలిస్టులు నగేష్, శంకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అధికారింగా చూస్తే ఇటీవల 36 మంది జర్నలిస్టులపై దాడులు జరిగాయన్నారు. బయటకు రాని సంఘటనలు వందలాదిగా ఉన్నాయన్నారు.



ఆంధ్రప్రదేశ్ చిన్న పత్రికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛకు, జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేసే జర్నలిస్టులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించుకునే పరిస్థితులు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని గుర్తుచేశారు. ఎన్ఎజె జాతీయ సహాయ కార్యదర్శి ఓ శాంతి మాట్లాడుతూ న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు వెళ్లిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకోవడం, నిర్బంధించడం, వారిపట్ల దురుసుగా వ్యవహరించడం ఆందోళనకరమైన పరిణామమన్నారు. ముఖ్యంగా మహిళా జర్నలిస్టుల పట్ల అవమానకరంగా వ్యవహరించడం ఖండించదగిన చర్యగా పేర్కొన్నారు. విజయవాడ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎవిఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, పత్రికా స్వేచ్ఛకు భరోసా, విధి నిర్వహణలో జర్నలిస్టులపై దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా గళమెత్తడం ఈ నిరసన కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ఎం.బి.నాథన్, ఎపిబిజెఎ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాఘవులు మాట్లాడారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు వల్లభనేని సురేష్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ జర్నలిస్టులపై దాడులు, నిర్బంధాలు ప్రజలకు సమాచారాన్ని చేరవేసే ప్రక్రియను అడ్డుకోవడమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన మీడియా పాత్రను బలహీనపరుస్తాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టుల భద్రతకు, స్వేచ్ఛగా విధులు నిర్వహించే హక్కుకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ జర్నలిస్ట్, ఎన్టీఆర్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు యేమినేని వెంకట రమణ, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, నగర అధ్యక్షులు తాళ్లూరి అనిల్ కుమార్,నాయకులు రెడ్డి, ఫెడరేషన్ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు బి.రవీంద్రనాథ్‌ఠాగూర్ సందేశాలు ఇచ్చిన వారిలో ఉన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా దసరా శరన్నవరాత్రులు

**జై భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి పూజలు**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 14, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేజ్–2 రింగ్ రోడ్ రోడ్ నెంబర్ 21లోని జై భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు అత్యంత కన్నులపండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి మండపంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. **భక్తిశ్రద్ధలతో నవరాత్రుల వేడుకలు** ఈ వేడుకల్లో నిర్వాహకురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అమ్మవారి నవరాత్రులను ఇలా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవడం వల్ల భవానీ భక్తులలో దైవభక్తి మరింత పెంపొందుతుందని, అందరూ ఉత్సాహంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అమ్మవారి దివ్యక్షేత్రంలో పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో అనిల్ కుమార్, ఆదిత్య, రాము, సిద్ధు, గిరి, చందు, గణేష్, రేహన్, సిరి, చోటు, జాను, గౌతమి, తేజ, ఝాన్సీ, సమీర్‌తో పాటు యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## వైభవంగా శంభిపూర్ రాజు నూతన గృహప్రవేశం: ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



**దుండిగల్, అక్టోబర్ 14, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని శంభిపూర్‌లో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు నూతన గృహప్రవేశ వేడుక బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యానికి భౌరంపేట్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై, ఎమ్మెల్సీ దంపతులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొత్త గృహంలోకి అడుగుపెట్టిన శంభిపూర్ రాజు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ గృహప్రవేశ వేడుకలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, భౌరంపేట్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోలీస్ గోవింద్ రెడ్డి, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చింత వెంకట్, గడిల బాబు, గడిల చింటూ తదితరులు పాల్గొన్నారు.

## దూలపల్లిలో వైభవంగా నూతన గృహప్రవేశ వేడుక: హాజరైన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 14, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లిలోని రామాలయం సమీపంలో దొడ్ల రాములమ్మ, దొడ్ల శ్రీనివాస్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న గృహంలో గృహప్రవేశ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కొత్త గృహంలోకి అడుగుపెట్టిన దంపతులను, కుటుంబ సభ్యులను కొలన్ హన్మంత్ రెడ్డి ఆత్మీయంగా పలకరించి హృదయపూర్వక గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన గృహంలో వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం సంతోషంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శివ కుమార్ గౌడ్, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, దప్పు నరేందర్, నాగరాజ్ యాదవ్, సాయి యాదవ్, రాజేష్ గౌడ్, చందర్ నాయక్, రాము యాదవ్, అలీష్ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'రాజరాజేశ్వరి హాస్పిటల్' శుభారంభం.

**ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్**



**సూరారం, అక్టోబర్ 14, (వార్తాప్రభ) :** సాయిబాబా నగర్ పరిధిలోని 292వ డివిజన్, సూరారం కాలనీ సెకండ్ హోమ్ జెండా ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'రాజరాజేశ్వరి హాస్పిటల్' ప్రారంభోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఉపేందర్ మరియు డాక్టర్ జయచంద్రల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే సత్సంకల్పంతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాజరాజేశ్వరి హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపి, సేవాభావంతో వైద్యం అందించాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజ్ కుమార్ ముదిరాజ్, రాజు యాదవ్, కిషోర్ ముదిరాజ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు నమోదు చేసుకోండి

**ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి**

**నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఓటే ఆయుధం : జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి**

**హైదరాబాద్ అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి):** హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు నమోదు చేసుకోవడంపై గ్రాడ్యుయేట్లు, మేధావులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన హక్కు, బాధ్యత అని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయాన్ని బలంగా వినిపించే సాధనం ఓటు అని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులను బాధ్యతాయుతంగా నిలదీయాలని సూచించారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలను మాత్రమే నమ్మకుండా, అభ్యర్థుల అర్హతలు, సామర్థ్యం, గత పనితీరును పరిశీలించి ఓటు వేయాలని కోరారు.



**పార్టీలకతీతంగా ప్రజా సమస్యలపై స్పందించే అభ్యర్థులనే ఎన్నుకోవాలి** ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇస్తున్న రాజకీయ పార్టీలు, వాటి అమలులో విఫలమవుతున్న సందర్భాలు ఉన్నాయని కుమారస్వామి అభిప్రాయపడ్డారు. అందువల్ల పార్టీలు, రాజకీయ అనుబంధాలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాడే సమర్థులైన అభ్యర్థులను గుర్తించి గెలిపించుకోవాలని అన్నారు. గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు, ఇతర అర్హులైన పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై కృష్ణారెడ్డి, రాజు, సామాజికవేత్త గోపాల్‌రెడ్డి, గాలి శ్రీనివాసరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు. పలువురు గ్రాడ్యుయేట్లు, మేధావులు సమావేశానికి హాజరయ్యారు.

# నకిలీ మిరప విత్తనాలతో రైతులకు నష్టం!

● 45 రోజులైనా పూత లేదు.. కాయ లేదు! ● ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని రైతుల ఆవేదన ● 45 విత్తనాల దుకాణం లైసెన్స్ రద్దు చేయాలి.. డిస్ట్రిబ్యూటర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి ● 45 రైతు సంఘం మండల కార్యదర్శి బచ్చల కూర కూర శ్రీనివాస్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నకిలీ విత్తనాల విక్రయాలతో రైతులు నష్టపోతున్నా సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ మర్రి తండా, చింతల తండాకు చెందిన రైతులు నాసిరకం విత్తనాలతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతు సంఘం మండల కార్యదర్శి బచ్చులకూర శ్రీనివాసరావు, నల్లగోపు పుల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం సుజాతనగర్ మండల వ్యవసాయ అధికారి జి నర్మదకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూరైతులు మాలోత్ ఈరన్న, భూక్య వీరు తెలిపిన వివరాల ప్రకారం.. 2026 జూన్ 26న జూలూరుపాడు ప్రధాన రహదారిపై ఉన్న శ్రీశ్రీ బాలాజీ ట్రేడర్స్ వద్ద నుంచి ఏఆర్ 243 ప్లస్ పేరుతో 25 మిరప విత్తనాల ప్యాకెట్లను కొనుగోలు చేశారు. విత్తనాలు నాటిన 45 రోజులైనా ఆశించిన స్థాయిలో పూత, కాయలు రాకపోగా, తెల్లకాయలు, పొట్టి కాయలు రావడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. అని అన్నారు **లేబుల్ ఒకటి.. విత్తనాలు మరొకటా?**విత్తనాల ప్యాకెట్లపై ఏఆర్ 243 ప్లస్ అని ఉండగా, ప్యాకెట్ కింద బంజారా సీడ్స్ అనే లేబుల్ కనిపించిందని రైతులు ఆరోపించారు. దీంతో తాము కొనుగోలు చేసిన విత్తనాలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ దుకాణ యజమానిని నిలదీశారు. డిస్ట్రిబ్యూటర్ తాళ్లూరి సతీష్‌ను ఫోన్‌లో సంప్రదించగా, విత్తనాలు నకిలీవి కావని, ఏం చేసుకుంటారో చేసుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి బెదిరించారని రైతులు ఆరోపించారని అన్నారు



**ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం** విత్తనాల కారణంగా ఒక్కో ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన తమకు పంట చేతికందకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, విత్తనాల నాణ్యతను పరీక్షించాలని డిమాండ్ చేశారు. **లైసెన్స్ రద్దు చేయాలి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**రైతులను నష్టపరిచినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీశ్రీ బాలాజీ ట్రేడర్స్ విత్తన విక్రయ లైసెన్స్‌ను రద్దు చేయాలని, సంబంధిత డిస్ట్రిబ్యూటర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాధిత రైతులకు తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని వ్యవసాయ అధికారిని కోరారు.

# అనాధాశ్రమంలో ఘనంగా డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలు



**మంచిర్యాల, అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కల్వరి అనాధాశ్రమంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సంతోష్ యాదవ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అన్నా అంటే నేనున్నా అంటూ ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు, గొల్ల కురుమల కోసం నిరంతరం నిస్వార్థ సేవలు అందిస్తూ నిరుపేదలకు కరోనా నేపథ్యంలో అనేక సేవలు చేసి గౌరవ డాక్టర్లు రెండు పొంది ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డులు కూడా బెంగళూరులో ఈ మధ్యలో తీసుకున్న మహా నాయకుడు కొమ్ము అశోక్ యాదవ్ అన్నారు. వారు మన యాదవ జాతిలో ఉండడం మన



అదృష్టంగా భావిస్తున్నామనీ, ఆయన జన్మదిన వేడుకలు చేసుకోవడం మన అదృష్టంగా భావిస్తూ అన్నదాన కార్యక్రమం తో పాటు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం కూడా చేయడం జరిగింది అన్నారు. అనంతరం కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ హాజరై మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు చేస్తున్న జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్ కి జిల్లాలోని ప్రతి మండల నాయకులకు నా జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక నామీద ఇంత అభిమానం చూపినందుకు మీకు జీవితాంతం రుణపడి ఉంటానని, నా ఒంట్లో ఊపిరి ఉన్నంతవరకు సమస్యలపై నిరుపేదల కోసం ప్రభుత్వానికి వారధిలా ఉంటూ నా తుది శ్వాస ఉన్నంతవరకు మీ సేవకుడిగా పని చేస్తా అన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన న ప్రియ మిత్రులందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అల్లముల సదానందం యాదవ్, భీమారం మండల ప్రధాన కార్యదర్శి కేశవేణి సత్యనారాయణ యాదవ్, మందమరి మండల ఉపాధ్యక్షులు సందన వేణి మల్లేష్ యాదవ్, అల్లాముల మహేష్ యాదవ్, నవీన్ యాదవ్, కల్వరి ఆశ్రమం సమస్త డైరెక్టర్ కుమార్ మండల నాయకులు దాడి రాజబాబు, జాగటి సమ్మయ్య, రాజన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ - డిజిపి సి. వి . ఆనంద్

● డిజిపి కార్యాలయంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు ● బతుకమ్మ ప్రకృతిని ఆరాధించే పండుగ ● ఆత్మీయతకు, రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీక: -డిజిపి




**హైదరాబాద్ :అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని డిజిపి సి. వి. ఆనంద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బోనాలు, బతుకమ్మ పండుగలకు విశేష ప్రాధాన్యం ఉందన్నారు. బుధవారం డిజిపి కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ చిన్నతనంలో అమ్మమ్మ ఇంట్లో బతుకమ్మ ఆడిన రోజులను గుర్తు చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా దసరా పండుగను వివిధ సంప్రదాయాలతో నిర్వహిస్తారని, గుజరాత్‌లో దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తే.. తెలంగాణలో గౌరమ్మను పూజిస్తూ బతుకమ్మను జరుపుకోవడం ప్రత్యేకత అని వివరించారు. బతుకమ్మ ప్రకృతిని ఆరాధించే పండుగ అని పేర్కొన్న ఆయన ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ వేడుకలు ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొంటూ ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిపి సి వి ఆనంద్ తో పాటుగా డిజి (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, డిజి (ఆర్గనైజేషన్) స్వాతి లక్రా, ఎ డి జి అకున్ సబర్వాల్, మల్టీ జోన్– × ఐ జి చంద్రశేఖర్‌రెడ్డి, ఐ జి రోడ్ సేఫ్టీ రమేష్ నాయుడు తో పాటుగా సీఐవోలు, ఎ ఓ లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూలో చేరిన ఓఆర్ఆర్ - హెచ్ఎండీఏ కాంట్రాక్ట్ కార్మికులు



**కీసర, అక్టోబర్ 14(వార్తా ప్రభ):** కీసర టోల్‌గేట్ వద్ద హెచ్ఎండీఏ కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో పనిచేస్తున్న 62 మంది కార్మికులు సీఐటీయూలో చేరారని కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలిపారు. కార్మికుల హక్కుల కోసం, కార్మిక చట్టాల అమలు కోసం సీఐటీయూ పోరాడుతుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 1వ తేదీన జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్, వారాంతపు సెలవులు, 9 రకాల సేఫ్టీ కిట్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, తొలగింపులను నిలిపివేయాలని కోరారు.

# హైదరాబాద్

## పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా దంపతులు





**జవహర్ నగర్, అక్టోబర్ 14(వార్తా ప్రభ):**సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య మహిళా కార్మికులకు మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి నాగరాణి శ్రీనివాస్ గుప్తా దంపతులు బతుకమ్మ కానుకగా చీరలను పంపిణీ చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషి అనిర్వచనీయమని, వారి సేవలను గుర్తించి వారికి అండగా నిలవడం తమ బాధ్యత అని ఈ సందర్భంగా రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు. బతుకమ్మ పండుగ మహిళలకు ఎంతో ప్రత్యేకమైనదని, పండుగ వేళ పారిశుద్ధ్య మహిళా కార్మికుల ముఖంలో చిరునవ్వు చూడటమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్, శ్రీమన్నారాయణ, మౌనిక రెడ్డి, వసంత, సవిత గౌడ్, లేఖ గౌడ్, భారతి. రజిత. వనిత. మౌనిక, పలువురు మహిళా కార్మికులు పాల్గొని, తమకు చీరలను అందజేసిన మాజీ డిప్యూటీ మేయర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం తమ కష్టాన్ని గుర్తించి ఇలా పండుగ కానుకలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

## పద్మానగర్ ఫేజ్-2 రింగ్ రోడ్డులో ఘనంగా అమ్మవారి నవరాత్రులు : భక్తిశ్రద్ధలతో పూజలు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 14, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేజ్–2 రింగ్ రోడ్డు ప్రాంతంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ పవిత్ర వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న మల్లారెడ్డి, దుర్గారెడ్డి, కేవీఎన్ చారి, పుట్ట భూలక్ష్మణ్ మాట్లాడుతూ.. నవరాత్రుల సందర్భంగా అమ్మవారి సేవలో ప్రత్యక్షంగా భాగస్వాములు కావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. అమ్మవారి కృపతో ఈ ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలతో స్థానికంగా పండుగ వాతావరణం నెలకొంది.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

**మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**




**షాపూర్‌నగర్, అక్టోబర్ 14, (వార్తాప్రభ) :** హైదరాబాద్‌--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం మరియు ఓటరు నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. నవంబర్ 6వ తేదీ ఓటరు నమోదుకు చివరి గడువు కావడంతో, నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని అర్హులైన పట్టభద్రులంతా విధిగా ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికులా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. యువ నాయుడైన తనను అభ్యర్థిగా ఎంపిక చేసిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి, పట్టభద్రుల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు 30 వేలకు పైగా పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకుని తన విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో పట్టభద్రులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రాజ్ భవన్ లోకి నల్లారి వారి ప్రవేశం ఎపుడు ?

నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం. చివరి సీఎం గా కూడా ఆయనకే రికార్డు ఉంది. మొత్తం రాజకీయ జీవితం అంతా కాంగ్రెస్ లోనే అధికార పదవులు అందుకుంటూ సాగింది. సీఎం గా పనిచేసిన తరువాత ఆయన రాజకీయ దశ ఏ మాత్రం తిరగలేదు. అంతే కాదు రాజకీయంగా టర్నింగ్ పాయింట్ ఏదీ లేకుండా పోయింది. సొంత పార్టీ అంటూ జై సమైక్యాంధ్రా పేరుతో విభజన ఏపీలో కొంత హడావుడి చేసినా మళ్లీ కాంగ్రెస్ లో చేరినా ఆ తరువాత బీజేపీలోకి వచ్చినా రాజకీయ కిరణాలు మాత్రం పరచుకోవడం లేదు, కొత్త వెలుగు అయితే ఎక్కడా కనిపించడం లేదు. విశేష రాజకీయ అనుభవం ఉంది, పాలనాపరమైన దక్షత ఉంది. ఏపీలో బలమైన సామాజిక వర్గానికి చెందిన వారిగా గుర్తింపు ఉంది. వివాదరహితుడిగా మంచి పేరు ఉంది. అన్ని ఉన్నా కూడా రాజకీయ సిరి మాత్రం ఇంకా పలకరించడం లేదని అంటున్నారు.లేటెస్ట్ గా చూస్తే కేంద్ర ప్రభుత్వం ఆరు రాష్ట్రాలకు కొత్తగా గవర్నర్లను ప్రకటించింది. అందులో చూస్తే కిరణ్ కుమార్ రెడ్డి పేరు ఎక్కడా లేరు. వారంతా బీజేపీకి చెందిన వారే కావడం విశేషం. కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ వారు కాదా అంటే ఆయన కాంగ్రెస్ నుంచి వలస వచ్చిన నేతగానే కాషాయం పార్టీలో గుర్తిస్తారు అని అంటున్నారు. ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్న వారికి అసలైన బీజేపీ నేతలకే కమలం పార్టీలో అధిక ప్రాధాన్యత అని చెబుతారు. పైగా బీజేపీ రాజ్ భవన్ లలో ప్రవేశించే గవర్నర్లను కూడా చాలా జాగ్రత్తగా ఎంపిక చేస్తుంది అని గుర్తు చేస్తున్నారు. బీజేపీ ఫిలాసఫీ పూర్తిగా ఒంటబట్టించుకున్న వారికే ప్రయారిటీ అని కూడా చెబుతున్నారుసరిగ్గా ఇక్కడే కిరణ్ కుమార్ రెడ్డికి మైనస్ అవుతోంది అని అంటున్నారు. ఆయన బేసికల్ గా చూస్తే కాంగ్రెస్ వాది. ఆయన తండ్రి నుంచి కాంగ్రెస్ వాదమే ఉంది. దాంతోనే ఆయనను బీజేపీలోకి చేర్చుకున్నా కూడా కీలక పదవుల దగ్గరకు వచ్చేసరికి ఈ అంతరాలు గుర్తుకు వస్తున్నాయని అంటున్నారు. ఆయనకు 2024 ఎన్నికల్లో రాజంపేట లోక్ సభ సీటు ఇచ్చారు. అది ఆయన సొంత ఇలాకా. అయినా ఆయన కూటమి ప్రభంజనంలో సైతం ఓటమి పాలు అయ్యారు. దాంతో బీజేపీ పెద్దలకు ఆయన మీద ఉన్న గట్టి నమ్మకాలు కొంత సడలిపోయాయని అంటున్నారు. బీజేపీ ఎపుడూ ఫలానా వారికి పదవి ఇస్తే ఏమిటి రాజకీయ లాభం అని లెక్కలు వేసుకుంటుంది అని చెబుతున్నారు. కేవలం బీజేపీ మాత్రమే కాదు ఏ రాజకీయ పార్టీ అయినా అదే చూస్తుంది అని అంటున్నారు. ఇక కిరణ్ కుమార్ రెడ్డి మొదట్లో రాజ్య సభకు వెళ్లాలని చూశారు. అలా పెద్దల సభ నుంచి నేరుగా కేంద్ర మంత్రి పదవిని పట్టాలని అనుకున్నారు. అయితే బీజేపీలో సమీకరణలకు అది కుదరదు అనుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. తనకు ఉన్న అనుభవంతో రాజకీయాల్లో సీనియారిటీతో మాజీ సీఎం హోదాతో గవర్నర్ పదవి అయితే బెటర్ అని భావించారు. దాంతో ఆయన రాజ్ భవన్ వైపే ఆశగా చూస్తున్నారు అని అంటున్నారు. ఈ క్రమంలో ప్రత్యక్ష రాజకీయాలకు ఆయన దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇక ఢిల్లీలో బీజేపీ కేంద్ర పెద్దలకు ఆయన టచ్ లో ఉంటున్నారు అని చెబుతున్నారు. అలాగే ఏపీలో కూటమి సారధి, ముఖ్యమంత్రి చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలను కూడా ఆయన బాగానే నెరుపుతున్నారు. అయినా సరే అనుకున్నది మాత్రం సాధించడంతో ఆయన వెనకబడుతున్నారనీ అంటున్నారు. వారి దయ మాత్రమే : ఇంతకీ కిరణ్ కుమార్ రెడ్డికి రాజ్ భవన్ యోగం ఉందా అంటే అదంతా బీజేపీ పెద్దల దయ అని అంటున్నారు. కేంద్ర నాయకత్వం అయితే అన్నీ ఆచీ తూచీ ఎంపిక చేస్తోంది. దాంతో కిరణ్ కుమార్ విషయంలో వారు సానుకూల నిర్ణయం తీసుకుంటే మాత్రం ఆయన మరో విడతలో అయినా గవర్నర్ నల్లారి వారు అవుతారు. మరి ఆ రోజు ఎపుడు వస్తుందో తెలియదు, అంతవరకూ కిరణ్ కుమార్ రెడ్డి వేచి ఉండడమే అని అంటున్నారు అంతా.

## హోల్డింగ్ ఏరియాల్లో భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు.. పరిశుభ్రమైన వాతావరణం

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ పశ్చిమ అక్టోబర్ 14 :(వార్త ప్రభ ప్రతినిధి) విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం సాయంత్రం వినాయకుని గుడి, కెనాల్ రోడ్, వన్‌టౌన్ ప్రాంతాల్లోని హోల్డింగ్ ఏరియాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులకు విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో హోల్డింగ్ ఏరియాల్లో నిరంతర తాగునీటి సదుపాయంతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తాగునీటి సౌకర్యాలను అందుబాటులో ఉంచడంతోపాటు, వినియోగించిన వాటర్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను సేకరించేందుకు డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసి నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నారు.హోల్డింగ్ ఏరియాల్లో భక్తుల రాకపోకలు నిరంతరం కొనసాగుతున్నప్పటికీ, ప్రతి కంపార్ట్‌మెంట్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. ఒక విడత భక్తులు ముందుకు సాగిన వెంటనే తదుపరి విడత భక్తులకు కూడా శుభ్రమైన పరిసరాలు అందుబాటులో ఉండేలా పారిశుద్ధ్య కార్యకలాపాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. భక్తుల ఆరోగ్యం, సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ విజయవాడ నగరపాలక సంస్థ సమర్థవంతమైన పారిశుద్ధ్య నిర్వహణతో మెరుగైన వాతావరణాన్ని అందిస్తోంది.ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. సి.హెచ్. నిర్మల గ్లోరీ, ఎండోమెంట్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమాదేవి, సంబంధిత సిబ్బంది, పాల్గొన్నారు.

## మైలవరం మండలం ఎంపీటీసీ రిజర్వేషన్లు ఖరారు...

**మైలవరం:అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలం లోని 19 మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు (ఎంపీటీసీ) రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి.

**రిజర్వేషన్ కేటగిరీల సంక్షిప్త వివరాలు:** 1.మోర్సుమిల్లి- ఓసీ మహిళ, 2.పుల్లూరు-1 ఓసి, 3.పుల్లూరు-2 ఓసీ మహిళ,4.చంద్రగూడెం-1బీసీ మహిళ, 5.చంద్రగూడెం--2 ఓసి, 6.తోలుకోడు- ఎస్సీ మహిళ, 7.పొందుగల-బిసి, 8.మైలవరం-1 బీసీ మహిళ , 9.మైలవరం -2 ఓసీ మహిళ, 10.మైలవరం-3 బిసి ,11.మైలవరం-4 ఓసీ, 12.మైలవరం-5 ఓసీ మహిళ, 13.మైలవరం-6 ఓసి , 14.వెల్వాడం-1 ఎస్సీ, 15.వెల్వాడం-2ఓసీ మహిళ, 16.గణపవరం ఎస్సీ ,17.చంద్రాల-1 ఎస్సీ మహిళ,18.చంద్రాల-2 ఓసి ,19.కీర్తిరాయునిగూడెం-ఎస్టీ.

## శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 14 :(వార్త ప్రభ ప్రతినిధి)** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల మరియు డా. ఏ.ఎల్. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, విజయవాడ సంయుక్తంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ సంచాలకులు గోపాల కృష్ణ, ఐ.ఏ.ఎస్. ఆదేశాల మేరకు భక్తులకు నాణ్యమైన ఆయుర్వేద వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరానికి భక్తులు, ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు సుమారు 7,000 మంది భక్తులు ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు ఆయుర్వేద చికిత్సలతో పాటు అభ్యంగం (ఆయుర్వేద తైల మర్దన చికిత్స) కూడా అందిస్తున్నారు.ఈ శిబిరాన్ని డా. ఏ.ఎల్. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్య పర్యవేక్షకులు డా. పి. జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. రెండు ప్రభుత్వ సంస్థలకు చెందిన అధ్యాపకులు, వైద్యులు, ఆయుర్వేద పీజీ విద్యార్థులు, ఇంటర్నీలు మరియు సిబ్బంది చురుకుగా పాల్గొంటూ భక్తులకు వైద్య సేవలను అందిస్తున్నారు.ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం 20 అక్టోబర్ 2026 వరకు కొనసాగుతుంది. కావున, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు మరియు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత ఆయుర్వేద వైద్య సేవలను పొందవలసిందిగా కోరడమైనది.ప్రజలకు అందుబాటులో ఆయుర్వేద వైద్య సేవలను అందించడం, ఆయుర్వేద వైద్య విధానాన్ని ప్రోత్సహించడం మరియు పండుగల సమయంలో భక్తులకు ఆరోగ్య సేవలను విస్తరించడం ఈ శిబిరం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని నోరి రామ శాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ బుల్లయ్య తెలిపారు.

## పురపాలక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

### అధికారులకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 14 :(వార్త ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్ జారీ చేసిన నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం సాయంత్రం శాఖాధిపతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, పురపాలక ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, అధికారుల సన్నద్ధతపై సమీక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, ర్యాంపులు అందుబాటులో ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులు, బాధ్యతలను అధికారులకు కేటాయించిన మేరకు ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఎన్నికల నిర్వహణ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న అదనపు కమిషనర్ ఎ. రవీంద్రరావు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డా. డి. చంద్రశేఖర్ కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, వెబ్‌కాస్టింగ్‌కు అవసరమైన సాంకేతిక, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.చీఫ్ సిటీ ప్లానర్ జి. రత్నకుమార్ ఎన్నికలకు అవసరమైన ప్రింటింగ్ మెటీరియల్, రూట్‌వారీ వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. దేవిన హరీష్ పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసి, అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.నగరంలో ఒకవైపు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, మరోవైపు సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో, వీటితోపాటు పురపాలక ఎన్నికల ఏర్పాట్లను కూడా అధికారులు సమాంతరంగా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కమిషనర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

## క్వాంటమ్‌ను సమాజ అవసరాలతో అనుసంధానించాలి



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 14 :(వార్త ప్రభ ప్రతినిధి)** క్వాంటమ్ సాంకేతికతను సమాజ అవసరాలతో అనుసంధానించాలని అంతరిక్ష శాస్త్రవేత్త డాక్టర్ సాంబశివరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ప్రాజెక్ట్--క్యూ పేరుతో క్వాంటమ్ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా ల్యాబ్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభలో డాక్టర్ సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా రక్షణ, పోస్ట్ క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ తదితర అంశాల ప్రాధాన్యతను విద్యార్థులు గుర్తించాలన్నారు. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ భద్రత తదితర సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించటానికి విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా క్వాంటమ్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, క్లైమేట్ టెక్నాలజీ అంశాలపై 'క్రియోవ్' పేరుతో 24 గంటల హ్యాకథ్యాన్, ఇన్నోవెంట్ పేరుతో ప్రాజెక్ట్ ఎక్స్‌పో, థింక్‌వోర పేరుతో ఐడియాథాన్ తదితర అంశాలపై నిర్వహించిన పోటీలకు అనూహ్య స్పందన లభించినట్లు కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధశారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యూబిట్ ఫోర్స్ సీఈవో ఎల్ వెంకట సుబ్రహ్మణ్యం, ఈవై సీనియర్ సైబర్ సెక్యూరిటీ మేనేజర్ (టెక్సస్ యుఎస్ఏ) పీ విద్యాసాగర్, వర్క్‌డే సెక్యూరిటీ లీడ్ ఎన్ వెంకటరామిరెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ప్రముఖులు వెంకట్ కేటిబోయిన, గంగిశెట్టి జగదీష్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్, విభాగాధిపతులు డాక్టర్ డీ దుర్గాప్రసాద్‌లు నిర్వహించారు.

## శ్రీ అన్నపూర్ణ దేవీ గా దర్శనం ఇచ్చిన చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

### అమ్మవారిని దర్శించుకొన్న నగర మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 14 :(వార్త ప్రభ ప్రతినిధి)** చిట్టినగర్ శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నందు దసరా శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు మరుపిళ్ళ దేవి ప్రసాద్ ప్రత్యేకమైన కూరగాయల దండ గజమాల చేయించారు. అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం చేసుకున్నారు సుమారుగా 3000 మంది భక్తులు అమ్మవారు కృపాకటాక్షాలతో దంపతులు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు పాల్గొన్నారు. బుధవారం నగర మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి నరేంద్ర దంపతులచే పూజా కార్యక్రమం భక్తులకు అన్నప్రసాధము కార్యక్రమంలో పాల్గొన్నారు. గుంటూరు వైసిపి సమన్వయకర్త పోతిన మహేష్ విజయలక్ష్మిదంపతులు పసుపు కుంకుమ సారి అమ్మవారికి సమర్పించారు.సీనియర్ రాజకీయ నాయకులు చెన్నుపాటి శ్రీను, దర్శి వాసు తెలుగుదేశం నాయకులు సారేపల్లి రాధా బూర కనకారావు నమ్మి భాను సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాసరావు



స్థానిక వైసిపి నాయకులు దేరంగుల రమణ దుర్గ అమ్మవారిని పూజించి భక్తులు భక్తి శ్రద్ధలతో దర్శించుకుని తీర్థ ప్రసాదలు స్వీకరించారు. కమిటీ సభ్యులు అందరూ అమ్మవారి సేవలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వచ్చిన ప్రతి భక్తులకి ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతిరోజు సాయంత్రం నృత్య ప్రదర్శన కార్యక్రమం చేయడం జరుగుతుంది వారికి సర్టిఫికెట్స్ గిఫ్ట్ దేవస్థానం నుంచి ఇవ్వడం జరుగుతుంది. అధ్యక్షులు పోతిన బేస్ కంతేశ్వరుడు సెక్రటరీ తొత్తడి భరత్, కోశాధికారి బెవర సాయి సుధాకర్, ఈది నరేష్ పిళ్ళా రవి తమ్మిన రఘు సత్యాల సింహాచలం మరుపిళ్ళ దేవి ప్రసాద్ శీరం వెంకటరావు రాంపిల్ల వాసు కామాందుల నరసింహారావు ఇద్దిపిల్లిపవన్ కుమార్ బాయన బెనర్జీ గూడెల మణికంఠ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మానవత్వమే మనిషికి నిజమైన ఆభరణం...

### వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 14.(వార్త ప్రభ ప్రతినిధి)** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే అసలైన సేవాధర్మం!జీవిత చరమాంకంలో, ఎన్నో కష్టాలను, ఒంటరితనాన్ని ఎదుర్కొంటూ, ఆప్యాయత కోసం ఎదురుచూస్తున్న వృద్ధుల ముఖాల్లో, చిరునవ్వులు పూయించడం కంటే, గొప్ప ఆనందం మరొకటి లేదు.అలాంటి ఓ గొప్ప సేవా కార్యక్రమం బుధవారం, విజయవాడలో ఆవిష్కృతమైంది. వివరాలు లోకి వెళ్తే, చిరంజీవి గరికిపాటి విష్ణు ఇటీవలే సాఫ్ట్వేర్ ఉద్యోగిగా చేరారు. తన తల్లి అడుగుజాడల్లో నడుస్తూ నెలనెలా తనకు వచ్చే జీతం నుండి కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలనే లక్ష్యంతో, నేడు వారి చెల్లెలు లాస్య ఓణిల వేడుక సందర్భాన్ని పురస్కరించుకొని, బుధవారం, రామవరప్పాడు లోని అశ్రిత వృద్ధాశ్రమంలోని, 55 మంది వృద్ధులకు, నూతన వస్త్రాలను, మరియు భోజనాలను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో, ట్రస్ట్ చైర్మన్ లయన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్, కార్యక్రమ దాత విష్ణు, వారి తల్లి, గరికిపాటి దేవి సుకన్య, చెల్లి, లాస్య, మామయ్య, పసుపులేటి రవికాంత్, అత్తమ్మ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కుష్మాండ దేవీ అలంకారం లో దర్శనం ఇచ్చిన శ్రీ దేవీ కరుమారి అమ్మన్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 14 :(వార్త ప్రభ ప్రతినిధి)** శ్రీ దసరా శరన్నవరాత్రి మహోత్సవం-2026 లో భాగంగా మిల్క్ ప్యాక్టరీ సమేపంలో సీ వీ ఆర్ ప్లై ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో దసరా వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం నాలుగో రోజు శ్రీ దేవి కరుమారి అమ్మ వారుశ్రీ కూష్మాండ దేవి రూపం లో దర్శనం ఇచ్చారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక హోమం నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలతో పాటుగా సామూహిక కుంకుమార్చన చేశారు. పీఠదిపతి శ్రీశ్రీశ్రీ కరుణానందనాథ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. అమ్మవారి సన్నిధి లోని కళా వేదికపై చిన్నారులతో నిర్వహించిన సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకొన్నాయి అమ్మవారి ఆలయానికి, భక్తుల కోసం ఏర్పాటు చేసిన విధ్యుత్ స్వాగత తోరణాలు భక్తులను ఆకట్టుకొన్నాయి. బుధవారం రాత్రి జరిగిన అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు లో మహిళా భక్తులు పూనకాలు వచ్చి ఊగి పోయారు నిర్వాహకులు పసుపు నీళ్ళు చల్లి ధుపాలు వేసి పూనకాలు వచ్చిన వారిని శాంతింపజేశారు.

## అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

### ఆకుల శ్రీనివాస కుమార్‌కు ఘన స్వాగతం పలికిన నగరాల దేవస్థానం పాలకమండలి





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 14: (వార్త ప్రభ ప్రతినిధి)** చిట్టినగర్‌లోని శ్రీ నగరాల సీతారామస్వామి, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానాన్ని సందర్శించిన సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస కుమార్‌కు పాలకమండలి ప్రతినిధులు మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు అమ్మవారి ఆశీస్సులు అందజేయగా, పాలకమండలి అధ్యక్షుడు బేసి కందేశ్వరుడు శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ, చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నూతన పాలకమండలి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి కోశాధికారి బెవర సాయి సుధాకర్,మాజీ పాలకమండలి సభ్యులు బెవర శ్రీనివాస రావు బి సి నాయకులు యర్రజర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ లో కెబిఎన్ కు జాతీయస్థాయి పతకాలు



**విజయవాడ పశ్చిమ అక్టోబరు 14: (వార్త ప్రభ ప్రతినిధి)** అఖిల భారత స్విమ్మింగ్ ఫెడరేషన్ కప్ 2026 పోటీల వివిధ విభాగాల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఒక బంగారు పతకం, మూడు రతజ, ఒక కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పి.కిరణ్ (బి.కాం కంప్యూటర్స్ మొదటి సంవత్సరం) బి.ఎఫ్ 200 మీటర్ల ఫ్రీ స్టైల్ లో రజత, 100 మీటర్ల ఫ్రీ స్టైల్ లో కాంస్య, 400 మీటర్ల ఫ్రీ స్టైల్ లో బంగారు, సర్ఫేస్ రిలే 4ఇ50 మీటర్ల విభాగంలో రజత పతకం సాధించాడన్నారు. బిబిఎ మొదటి సంవత్సరం చదువుతున్న టి.పృథ్వి ప్రసాద్ 4ఇ100 సర్ఫేస్ రిలే విభాగంలో రజత పతకం సాధించాడన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ తమ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచేలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమ చంద్రరావుని అభినందించారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య, కోశాధికారి గోళ్ళ బాబా విజయ్ కుమార్, హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారా యణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ విద్యార్థులను అభినందించారు.

# ఆల్ ఇండియా లాయర్స్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్

**న్యాయవాదుల జట్టు కెప్టెన్‌గా మహమ్మద్ మాజ్ షేక్ ఎంపిక**
**అధికారిక జెర్సీని ఆవిష్కరించిన సీనియర్ న్యాయవాది వేములపాటి పట్టాభి**




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 14:(వార్త ప్రభ ప్రతినిధి)**ఇండియన్ అడ్వొకేట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ (ఐ ఏ ఎస్ ఏ ) ఆధ్వర్యంలో జరగనున్న ప్రతిష్టాత్మక 8వ ఆల్ ఇండియా లాయర్స్ టీ–20 క్రికెట్ టోర్నమెంట్ (అలహాబాద్–2026) కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయవాదుల క్రికెట్ జట్టును అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఇండియన్ అడ్వొకేట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నరాల రమణమూర్తి ఒక పత్రికా ప్రకటన ద్వారా వివరాలను వెల్లడించారు. ఈ జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా గుంటూరుకు చెందిన మహమ్మద్ మాజ్ షేక్ ఎంపికయ్యారు. ఈ టోర్నమెంట్ ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ నగరంలో ఈ నెల అక్టోబర్ 16 నుండి 21 వరకు జరగనుంది. కాగా ఏపీ రాష్ట్ర న్యాయవాదుల క్రికెట్ జట్టు అధికారిక జెర్సీని హైకోర్టు సీనియర్ న్యాయవాది వేములపాటి పట్టాభి ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఎన్. నాగూర్ బాబు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది వేములపాటి పట్టాభి మాట్లాడుతూ క్రీడలు న్యాయవాదులలో మానసిక ఉల్లాసాన్ని, ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కాన్పూర్‌లో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జట్టు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం న్యాయవాది నాగూర్ బాబు ఎన్. మాట్లాడుతూ.. ఏపీ న్యాయవాదుల క్రికెట్ జట్టుకు భవిష్యత్తులో కూడా తమ 'నాగూర్ బాబు లా ఫర్మ్' తరఫున పూర్తి సహాయ సహకారాలు మరియు మద్దతు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు.

**ఆంధ్రప్రదేశ్ జట్టు సభ్యుల వివరాలు:** కెప్టెన్ :మహమ్మద్ మాజ్ షేక్ (గుంటూరు), డాక్టర్ అన్వర్ షేక్ (ఏపీ హైకోర్టు), డి. అశోక్ కుమార్ (కాకినాడ),బి. ఫణీ కుమార్ (రాజమండ్రి), ఎం.వి. మోహన్ (తిరుపతి), ఎ. యశ్వంత్ (ఏలూరు), డి. మణికంఠ (రాజమండ్రి),ఎం. గౌరీ నాయుడు (తూర్పు గోదావరి),రామాంజనేయులు అంచుల (సత్తెనపల్లి), ఆలపాటి ఆకాష్ (గుంటూరు), ఎల్. సురేష్ (అమరావతి), ఎ.వి.పి.బి. తరుణ్ (విజయవాడ),టి. హేమంత్ సాయి (తిరుపతి),వి. శ్యామ్ కుమార్ (విజయవాడ), వై. సాయి రామ్ (గుంటూరు), పి. కృష్ణారావు (రాజమండ్రి), టీమ్ మేనేజర్: నరాల రమణమూర్తి (ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఐ ఏ ఎస్ ఏ). కాగా ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు హైకోర్టు సీనియర్ న్యాయవాదులు, వివిధ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు మరియు ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తూ, టోర్నమెంట్‌లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## నిమ్రా ఫార్మసీ అధ్యాపకురాలు శ్రీకళ కామిరెడ్డికి పీహెచ్‌డీ డిగ్రీ ప్రధానం



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 14(వార్తా ప్రభ ప్రతినిధి):**స్థానిక నిమ్రా ఫార్మసీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న శ్రీకళ కామిరెడ్డికి తమిళనాడులోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) డిగ్రీ ప్రధానం చేసింది. 'డెవలప్‌మెంట్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ సినర్జిస్టిక్ యాంటీ–ఒబేసిటీ హెర్బల్ ఫైటోసోమల్ ఫార్ములేషన్' అనే పరిశోధనా అంశంపై ఆమె తన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. డాక్టర్ ఎస్. సంగీత పర్యవేక్షణలో ఆమె ఈ పరిశోధనను పూర్తి చేసి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా బుధవారం నాడు నిమ్రా ఫార్మసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినేని నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్ధన్, అధ్యాపకులు, సిబ్బంది శ్రీకళ కామిరెడ్డిని అభినందించారు.

## మండలంలో ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు...

**జి.కొండూరు:అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండలంలోని 16 మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు (ఎంపీటీసీ) విజయవాడ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ బుధవారం రిజర్వేషన్లు ఖరారు చేశారు. 1.చెర్వు మాధవరం షెడ్యూల్ తెగలు(ఎస్టీ), 2.చెవుటూరు ఇతరులు (స్త్రీ), 3.జి.కొండూరు–1 వెనకబడిన తరగతులు(బిసి), 4.జి.కొండూరు–2 ఇతరులు (స్త్రీ), 5.గడ్డమణుగు ఇతరులు, 6.గంగినేనిపాలెం షెడ్యూల్ కులాలు (స్త్రీ), 7.కందులపాడు షెడ్యూల్ కులాలు (స్త్రీ), 8.కట్టుబడిపాలెం ఇతరులు, 9.కవులూరు–1 షెడ్యూల్ కులాలు (ఎస్సీ), 10.కవులూరు–2ఇతరులు (స్త్రీ), 11.కోడూరు ఇతరులు (స్త్రీ), 12.కుంటముక్కల ఇతరులు, 13.వెల్లటూరు–1ఇతరులు, 14.వెల్లటూరు–2 షెడ్యూల్ కులాలు (స్త్రీ), 15.వెలగలేరు వెనకబడిన తరగతులు (స్త్రీ), 16.వెంకటాపురం షెడ్యూల్ కులాలు(ఎస్సీ)

## శ్రీ కొండలమ్మకు సామూహిక కుంకుమార్చనలు, హోమాలు...



**గుడ్లవల్లేరు:అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో అమ్మవారికి శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవముల్లో భాగంగా బుధవారం విశేషాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, హోమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు(మోహన్), టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి రామరాజు దంపతులు, ఈఓ ఆకుల కొండలరావు దంపతులు, ధర్మకర్తలు తూము రాజ్యలక్ష్మీ, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంజనేయులు, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, నూతలపాటి లక్ష్మీ పావని, ఎక్స్–– అఫీషియో మెంబర్ రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మచే శ్రీ అమ్మవారి దేవస్థానంలో సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. సహస్రనామ కుంకుమార్చన, శ్రీ గాయత్రీ మూల మంత్రహవనములను చేపట్టారు. అనంతరం భక్తులు అందరికి దేవస్థాన సిబ్బంది ప్రసాదములు అందజేశారు.

## అక్కయ్య హితవు

దైవాన్ని నమ్ముకో
ధైర్యాన్ని తెచ్చుకో
మితిలేని సంతోషము
నీ సొంతం చేసుకో
ద్రోహాన్ని మానుకో
దోషాన్ని దిద్దుకో
దైనందిన బ్రతుకులో
ధ్యానమే చేసుకో
బాగుగా చదువుకో
సంస్కారం నేర్చుకో
ఈ సభ్య సమాజాన
క్షేమాన్ని కోరుకో
తెలుగు విలువ తెలుసుకో
దాని ఖ్యాతి చాటుకో
పూర్వ వైభవము కొరకు



కాసింత పూనుకో

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

## శ్రీసిటీ - ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిశ్రమ వితరణ

**- సత్యవేడులో బీసీ బాలుర కళాశాల హాస్టల్ రెండో నూతన భవనం ప్రారంభం**




**శ్రీసిటీ, అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి):**శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో, శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా సత్యవేడులోని బీసీ బాలుర కళాశాల హాస్టల్‌కు రెండో నూతన భవనాన్ని నిర్మించింది. రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని బుధవారం సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కొబయాషి, శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.గతంలో శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉంటూ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వారి సమస్యలను గుర్తించిన శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ ముందుకొచ్చి, గత ఏడాది నవంబర్‌లో రూ.50 లక్షల వ్యయంతో తొలి హాస్టల్ భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. దానికి కొనసాగింపుగా మరో రూ.50 లక్షలతో రెండో దశ భవనాన్ని నిర్మించింది. దీంతో విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా నిరీషా సన్నారెడ్డి మాట్లాడుతూ, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులు, సంబంధిత




సిబ్బంది నూతన వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రీసిటీ ప్రత్యేక చొరవకు పారిశ్రామిక సంస్థల చురుకైన భాగస్వామ్యం తోడవడంతో ఈ ప్రాంతంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. డివిజనల్ అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గతంలో హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందులు నూతన భవనాల నిర్మాణంతో తొలగిపోయాయని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు సహకరించిన శ్రీసిటీ, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాజమాన్యాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ డీజీఎం సంజయ్, హాస్టల్ సంక్షేమ అధికారి రామయ్యతో పాటు ఎన్ ఎస్ సంస్థ, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సేవలు : ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా సంస్థ గతంలోనూ సామాజిక బాధ్యతలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. గొల్లవారిపాలెంలో సుమారు రూ.35 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించింది. తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.8.5 లక్షలతో మరుగుదొడ్ల సదుపాయాలను మెరుగుపరిచింది. అలాగే, సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రూ.26 లక్షల విలువైన అంబులెన్స్‌ను అందజేసింది.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు కల్పించడమే చంద్రన్న లక్ష్యం

**- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ : గొల్ల నరసింహ యాదవ్,**




**తిరుపతి:అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇల్లు లేని నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, కార్మికులు, చేతివృత్తుల వారు, బ్రాహ్మణులు సహా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు కల్పించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచీ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందన్నారు. తిరుపతిలో టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇంటి స్థలాల అభివృద్ధి కోసం సుమారు రూ.230 కోట్లతో చేపట్టిన కార్యక్రమంలో ఉద్యోగులు రూ.80 కోట్లను తమ వాటాగా భరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇంకా స్థలాలు పొందని టీటీడీ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఇతర అర్హులైన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు కూడా ఇంటి స్థలాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆటో, టాక్సీ డ్రైవర్లు, దర్జీలు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు, చేతివృత్తుల వారు, నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలు, జర్నలిస్టులు, కెమెరామెన్లకు అర్హతల మేరకు ఇంటి స్థలాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఒక సెంటు స్థలంతో ఇల్లు నిర్మించుకోవడం కష్టమని, అలాంటి స్థలాలను తిరిగి ఇచ్చిన అర్హులకు రెండు సెంట్ల భూమి కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇంటి స్థలాలు అవసరమైన వారు తమ వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. తిరుపతి అభివృద్ధిలో భాగంగా మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుసంధాన రహదారుల పనులు ప్రారంభించినట్లు చెప్పారు. నగరంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ప్రజలకు ప్రశాంతమైన జీవనం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుపతి మేయర్ అభ్యర్థితో పాటు 66 డివిజన్లలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని నరసింహ యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మచిలీపట్నం నగరపాలక సంస్థ ఎన్నికలకు నోటిఫికేషన్

**మేయర్, 60 డివిజన్ల కార్పొరేటర్ల ఎన్నికకు షెడ్యూల్ విడుదల**

**మచిలీపట్నం అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. నగర మేయర్‌తో పాటు 60 డివిజన్ల కార్పొరేటర్లను ఎన్నుకునేందుకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆయా డివిజన్లలో నమోదైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం కోరింది. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టంలోని నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అక్టోబరు 16 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అక్టోబరు 18 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించారు. అక్టోబరు 19న ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన చేపడతారు. అక్టోబరు 21న మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థిత్వాల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. అక్టోబరు 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అవసరమైతే అక్టోబరు 29న రీపోలింగ్ చేపట్టనున్నారు. అక్టోబరు 30న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సంబంధిత అధికారులు తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

## పెడన జడ్పిటిసి వైసిపి అభ్యర్థిగా రాజులపాటి వాణి



**పెడన అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం వైసిపి మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఎంపీపీగా గరికపాటి రామానాయుడును ప్రకటించిన వైసిపి జడ్పిటిసి సభ్యురాలిగా రాజులపాటి వాణి అచ్యుతరావు ని నిర్ణయించారు. వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి ఉప్పాల రాము బుధవారం రాత్రి ముఖ్య నాయకులతో పెడన లోని పార్టీ కార్యాలయం లో సమావేశమై వారి అభిప్రాయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. మండల పరిధిలోని గురివిందగుంట గ్రామానికి చెందిన వాణి అచ్యుతరావు ఎంపీపీ గా బాధ్యతలు నిర్వహించారు. జడ్పీటీసీ పదవి బీసీ మహిళకు కేటాయించారు. ఈ నేపథ్యంలో వాణి ని అభ్యర్థిగా నిర్ణయించారు.

## జర్నలిస్టులపై దాడులకు నిరసనగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా







**రెడ్డిగూడెం, అక్టోబర్ 14,(వార్తాప్రభ ప్రతినిధి ):** ఢిల్లీ లో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై పోలీసులు దాడులు చేయడానికి నిరసనగా ఎపిడబ్లుజెఎఫ్ మరియు ఎపిబిజెఎ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం పాత్రికేయులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం, రాజ్యాంగ హక్కులు రక్షణ కోసం పాత్రికేయులు నిరంతరం శ్రమిస్తున్నారనీ, అలాంటి వారు విధుల్లో ఉండగా పోలీసులు దాడులు చేయటం రాజ్యాంగంపై దాడిలాంటిదేనని అన్నారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కనపర్తి శ్రీనివాసరావు, సిహెచ్ విజయకుమార్, రవి, బాలు, సుబ్బారావు, బి, ప్రసాద్, ప్రవీణ్, కె శ్రీనివాసరావు, వంశీ, ఎం ప్రసాదరావు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## పొట్లూరి సోమనాథ్ (సోము) మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపిన ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం, అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడలోని గురునానక్ కాలనీకి చెందిన పొట్లూరి సోమనాథ్ (సోము) ఆకస్మికంగా మృతి చెందడం పట్ల గౌరవ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమనాథ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## 26న శ్రీసిటీలో ప్రాంతీయ పెట్టుబడుల సదస్సు

**జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి, అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీసిటీలోని క్రియ యూనివర్సిటీ నందు ఈ నెల 26న నిర్వహించనున్న ప్రాంతీయ పెట్టుబడుల సదస్సుకు సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సదస్సు నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ షన్మోహన్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ క్రియ యూనివర్సిటీ నందు ప్రాంతీయ పెట్టుబడుల సదస్సు నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాంతీయ పెట్టుబడుల సదస్సుకు హాజరయ్యే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఇతర ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సదస్సు జరిగే ప్రాంగణంలో వేదిక, సమావేశ మందిరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, పార్కింగ్ వంటి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించి, లోటుపాట్లు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు. సదస్సుకు వచ్చే ప్రముఖులు, పారిశ్రామిక ప్రతినిధుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, రూట్ మ్యాపింగ్ వంటి అంశాలపై పోలీసు, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సదస్సు ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు చర్యలు సిద్ధంగా ఉంచాలని సూచించారుఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ మాట్లాడుతూ సదస్సును విజయవంతం చేయడానికి పరిశ్రమల శాఖ, పోలీసు, రెవెన్యూ, శ్రీసిటీ, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖ చేపట్టాల్సిన పనులకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఏర్పాట్ల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రాంతీయ పెట్టుబడుల సదస్సు ద్వారా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు అనుకూల వాతావరణాన్ని ప్రతిబింబించేలా అన్ని ఏర్పాట్లు నాణ్యతతో, సమర్థవంతంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్ర రెడ్డి, శ్రీసిటీ జనరల్ మేనేజర్ భగవాన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయభరత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు, డి ఆర్ డి ఏ అధికారి,శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు, శ్రీసిటీ అధికారులు, సత్యవేడు, సూళ్లూరుపేట, వరదయ్యపాళెం, తడ మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతా

**- ఎం.ఎల్.ఏ.గాంధీ**





**శేరిలింగంపల్లి,అక్టోబర్ 14 (వార్తాప్రభ):**హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ కాలనీలో రైల్వే అండర్‌పాస్ వద్ద రూ.70 లక్షలతో చేపట్టిన వరదనీటి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.ఈ పనుల అనంతరం అండర్‌పాస్‌ను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మాలెంపాటి, డీసీ సేవా ఇస్లావత్, ట్రాఫిక్ ఏసీపీ ఆదిమూర్తి, సీఐ నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి,మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మంజీరా పైప్‌లైన్ రోడ్డు నుంచి మసీద్‌బండకు వెళ్లే మార్గంలోని అండర్‌పాస్ వద్ద ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టినట్లు తెలిపారు. అండర్‌పాస్‌ను విస్తరించి రెండు వాహనాలు ఒకేసారి రాకపోకలు సాగించేలా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వరదనీటి సమస్యకు పరిష్కారం చూపడంతోపాటు ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలతో మౌలిక వసతులు కల్పించి, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈ శిరీష, డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అలరించిన వేణు శ్రీరంగం సంకీర్తన గానం



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 14 (వార్తాప్రభ):**అన్నమయ్యపురం లో అన్నమాచార్య భావనా వాహిని ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవం--26 నాలుగో రోజు ప్రముఖ గాయకుడు వేణు శ్రీరంగం సంకీర్తనా గానం అలరించింది. 'చాలదా హరినామ సంకీర్తన', 'హరి అవతారం మీతడు అన్నమయ్య', 'అపని వర ప్రసాది', 'గోవిందా శ్రిత గోకుల బృందా' తదితర కీర్తనలను ఆలపించి శ్రోతలను ఆకట్టుకున్నారు.కీబోర్డుపై రాజు, తబలాపై అజేయ్ సహకరించారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన కళారత్న సంజయ్ కిశోర్ మాట్లాడుతూ.. అన్నమయ్య కీర్తనల ప్రచారం కోసం జరుగుతున్న మహాయజ్ఞం ఫలితమే అన్నమయ్యపురమని అన్నారు.ఎన్నో ఏళ్లుగా శోభారాజు అలుపెరుగక చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.అనంతరం సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శోభారాజు,మేనేజింగ్ ట్రస్టీ నందకుమార్ అతిథులు, కళాకారులను చిత్రపటాలు అందించి సత్కరించారు.స్వామివారి మంగళహారతి, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

## మహా అన్నసమారాధన విరాళాలకు ఆహ్వానం...




**గుడ్లవల్లేరు:అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలం వేమవరం గ్రామంలో వెంచేసిన శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఈ నెల 18వ తేదీన జరుగు మహా అన్నసమారాధనకు ధన, వస్తువుల రూపేణా విరాళాలను ఆహ్వానిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, ఈఓ ఆకుల కొండలరావు కోరారు. బుధవారం చైర్మన్ మోహన్, ఈఓ కొండలరావు విలేకరులతో మాట్లాడుతూ ఈ మహా అన్నసమారాధనకు ధన, వస్తువుల రూపేణా విరాళాలను సమర్పించే దాతలు తప్పనిసరిగా రశీదు తీసుకోవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో ధర్మకర్తలు పెన్నేరు శేఖర్; తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంజనేయులు, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, నూతలపాటి లక్ష్మి పావని పాల్గొన్నారు.

## పూలనే దేవతగా పూజించే పండుగ "బతుకమ్మ"

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శారదాదేవి**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి) ::** ప్రకృతిలో లభించే పూలను బతుకమ్మగా పేర్చి దేవతగా పూజించే తెలంగాణ సంస్కృతి వైభవోపేతమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శారదాదేవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్.పి. కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు జిల్లా కలెక్టర్ కె.హరిత, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అనంతలక్ష్మి, ఎస్.పి. నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలమణి లతో కలిసి హాజరై బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన సాంస్కృతిక వైభవాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి, బతుకమ్మగా పేర్చి, దేవతా స్వరూపంగా భావించి పూజించే విశిష్టమైన సంప్రదాయం తెలంగాణలో ప్రత్యేకంగా కొనసాగుతోందని తెలిపారు.

# పౌర మౌలిక సదుపాయాల పనుల క్షేత్రస్థాయి పరిశీలన

**అధికారులతో కలిసి తనిఖీ చేసిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజన**







**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 14, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని జీడిమెట్ల సర్కిల్-55లో చేపట్టిన పలు అభివృద్ధి, పౌర మౌలిక సదుపాయాల పనులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజన (ఐ.ఏ.ఎస్), కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ (ఐ.ఏ.ఎస్) తో కలిసి బుధవారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు తగు సూచనలు చేశారు.

**కుత్బుల్లాపూర్ చౌరస్తా జంక్షన్ అభివృద్ధి** ప్రతిపాదిత కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం పక్కన ఉన్న కుత్బుల్లాపూర్ చౌరస్తా వద్ద విపరీతమైన వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ పనులను కమిషనర్ పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఈ జంక్షన్ అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**గాయత్రి నగర్ పార్క్, క్రీడా మైదానం పరిశీలన**

గాయత్రి నగర్ ఫేజ్-III పార్క్: ఈ పార్క్ సముదాయాన్ని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పార్కులో మరిన్ని అదనపు సౌకర్యాలను కల్పించాలని అధికారులను కోరారు.లి లిలిక్రీడా మైదానం అభివృద్ధి:లిలి ప్రతిపాదిత గాయత్రి నగర్ వార్డ్ ఆఫీసు పక్కన ఉన్న స్పోర్ట్స్ గ్రౌండ్‌ను పరిశీలించి ప్రణాళికను సమీక్షించారు. సీయస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులను సద్వినియోగం చేసుకుంటూ.. వాలీబాల్ కోర్టు ఏర్పాటు, ల్యాండ్‌స్కేపింగ్, మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడం, వివిధ ఆటల కోసం క్రీడా మైదానాలను తీర్చిదిద్దడం మరియు భద్రత కోసం సీసీ కెమెరాలను అమర్చడం వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్, ఈఈ భద్రు నాయక్, ఏసీపీ సురేందర్ రెడ్డి, ఏఎంసీ పి. ఉదయ్ కుమార్, యూబీడీ మేనేజర్ మహేందర్, డిప్యూటీ ఈఈ దుర్గా ప్రసాద్, ఎస్‌డబ్ల్యూఎం డిప్యూటీ ఈఈ శివ ప్రకాష్, ఏఈఈ సాయి నికితాసేన్, స్పోర్ట్స్ పార్ట్‌టైమ్ కోచ్ బి.ఆర్. చేతన్ తదితర సంబంధిత అధికారులు, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**నాణ్యతలో రాజీ వద్దు.. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి - మేయర్ మూడ్ గణేష్ ఆదేశాలు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం నగరంలోని రామవరం ప్రాంతం 15, 16వ డివిజన్ల పరిధిలో జాతీయ రహదారి వెంట సుమారు రూ.40 లక్షలతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.వర్షాకాలంలో రహదారులు, సమీప కాలనీలు నీటమునగకుండా, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా డ్రైన్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనుల వల్ల ప్రజలు, వ్యాపారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, నాణ్యతలో లోపాలు తలెత్తితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని, ఇళ్లలోకి వరద నీరు చేరకుండా సమగ్ర ప్రణాళికతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, 16వ డివిజన్ కార్పొరేటర్ పద్మ, 14వ డివిజన్ కార్పొరేటర్ సుధాకర్, 17వ డివిజన్ కార్పొరేటర్ శంకర్, కార్పొరేషన్ డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# అనుకున్నదొక్కటి... అయిందొక్కటి

**- చంద్రగిరిలో పదవుల ఆశావహులకు నిరాశేనా? రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ**




**చంద్రగిరి:అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చంద్రగిరి నియోజకవర్గంలో స్థానిక సంస్థల పదవులపై ఆశలు పెట్టుకున్న పలువురు నాయకులకు నిరాశ ఎదురవుతోందా? ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులు దక్కించుకోవాలనే లక్ష్యంతో రాజకీయంగా పావులు కదిపిన ఆశావహులకు ప్రస్తుత పరిణామాలు ఆశించిన స్థాయిలో అనుకూలించడం లేదా? అంటే అవుననే చర్చ నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నాయకుల పరిస్థితి ప్రస్తుతం 'అనుకున్నదొక్కటి.. అయిందొక్కటి' అన్న చందంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పలువురు నాయకులు ఇప్పటికే తమ తమ స్థాయిల్లో రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం తమకు అవకాశం కల్పిస్తుందనే నమ్మకంతో ప్రజల్లో గుర్తింపు పెంచుకునేందుకు ప్రయత్నించిన ఆశావహులు సైతం ఉన్నారు. అయితే, మారుతున్న రాజకీయ సమీకరణాలు, పార్టీ పరంగా అభ్యర్థుల ఎంపికపై నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో తమకు అవకాశం దక్కుతుందో లేదోనన్న ఆందోళన వారిలో మొదలైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.ముఖ్యంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలపై దృష్టి సారించిన నాయకులు తమ రాజకీయ భవిష్యత్తుపై లెక్కలు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు తమకు అనుకూలంగా ఉంటాయని భావించిన పరిస్థితులు మారుతుండటంతో కొందరు ఆశావహులు నిరాశకు గురవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ పరిణామాలపై సంబంధిత నాయకులు ఎవరూ బహిరంగంగా స్పందించకపోవడం గమనార్హం.మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలు, సామాజిక సమీకరణాలు, స్థానికంగా నాయకులకు ఉన్న ప్రజాబలం వంటి అంశాలు అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారే అవకాశముంది. దీంతో చివరి నిమిషంలో రాజకీయ పరిణామాలు ఎలాంటి మలుపు తీసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతానికి మౌనంగా ఉంటున్న ఆశావహులు పార్టీ అధిష్ఠానం నిర్ణయాల కోసం ఎదురుచూస్తున్నారా? రాబోయే రోజుల్లో కొత్త సమీకరణాలు తెరపైకి వచ్చి వారికి అవకాశాలు కల్పిస్తాయా? లేక కొందరి ఆశలు అడియాశలుగానే మిగిలిపోతాయా? అన్నది వేచి చూడాల్సిందే. మొత్తంగా చంద్రగిరి నియోజకవర్గంలో స్థానిక సంస్థల పదవుల వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# జరగబోయే ఎన్నికలలో కూటమి పార్టీల అభ్యర్థులను నిలదీయండి.

**బిసి లకు 50 సంవత్సరాలు కు పెన్షన్**

**ఆడబిడ్డనిధి, నిరుద్యోగభృతి,గ్యాస్ సిలిండర్,గూర్చి ప్రశ్నించండి**

**- గన్నవరం మాజీ జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి పిలుపు**




**గన్నవరం, అక్టోబర్ 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గత అసెంబ్లీ ఎన్నికలలో ఈవిఎం లు ద్వారా అర్ధ రాత్రి 11 గంటల తర్వాత 17 లక్షలు ఓట్లు పెరగటంతో ప్రభుత్వం అధికారంలోకి రావడం ప్రజలందరికీ తెలుసు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ లలో బిసి లకు 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్,ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి, నిరుద్యోగబృతి, గ్యాస్ సిలిండర్,రైతు భరోసా,విద్యార్థులకు పిజి రాయితీల విషయాలను ఓట్లు అడగటానికి వచ్చిన కూటమి పార్టీల అభ్యర్థులను ప్రశ్నించాలని గన్నవరం మాజీ జెడ్పీటీసీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షులు అన్నవరపు ఎలిజబెత్ రాణి ప్రజలకు పిలుపునిచ్చారు.నేడు ప్రభుత్వం ప్రకటించిన స్థానిక సంస్థలు ఎన్నికలలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని మరల దుర్వినియోగం చేయటానికి కూటమి పార్టీలు ప్రయత్నం చేస్తున్నారన్నారు.అందువల్లా వివేకులైన ప్రజలు నేటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల గురించి అడగలని, అలాగే సమస్యలుపై ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై రాష్ట్రంలో అత్యధిక గ్రామాలలో అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించటం, హింసిస్తున్న విషయం కూడా ప్రశ్నించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు అని ఆమే తెలిపారు.నేడు పేదలు నిత్యవసర సరుకులు అయిన ప్రధానంగా బియ్యం, ఉల్లి, నూనె,కందిపప్పు,పెరిగిన ధరలుతో కొనలేని పరిస్థితి ఉంది, రాష్ట్రానికి పరిశ్రమలు ద్వారా ఆదాయం సమకూర్చుతానని చెప్పిన ప్రభుత్వం ఆ ఆదాయం సృష్టించకుండా పేదలు వాడే మద్యన్నీ ప్రతి గ్రామంలో విలయతాండంగా విధి వీధిన ఏరులై పారుతూ పేదకుటుంభాలు రోడ్డున పడవేసిన పరిస్థితినీ మనం అర్థం చేసుకోవాలని ఆమే అన్నారు.మన మహానేత కీర్తిశేషులు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విద్యా విప్లవకారుడు ఆయన పేదవాడు చదువుకోవాలంటే ఆర్థిక పరిస్థితి అడ్డు కాకూడదని ఆలోచించిన మొదటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు తెలుసు,

2008లో దేశంలోనే మొదటిసారిగా విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపారు అగ్రకులం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అనే తేడా లేకుండా - అర్హత ఉంటే చాలు, ప్రభుత్వమే ఫీజు కడుతుందని భరోసా ఇచ్చిన నాయకుడు కార్పొరేట్ కాలేజీల దోపిడీకి అడ్డుకట్ట వేసి, పేదవాడి కలలకు రెక్కలు తొడిగిన నాయకుడు మన వైఎస్ఆర్ ఆనాడు వైఎస్ఆర్ గారు వేసిన బీజమే, ఆనాడు వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో మరింత బలోపేతం చేసి కొనసాగించారు.అటువంటి అభివృద్ధి గిట్టని కూటమి ప్రభుత్వం మరల ఈ ఎన్నికలలో అనేక విధాలుగా కుట్రలకు తెగబడుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తూన్నారు.దీనికి అడ్డకట్టవేయాలని పేద ప్రజల అభివృద్ధి కోసం పని చేసిన వైఎస్ఆర్ పార్టీ సంక్షేమ పథకాలు గుర్తు చేసుకోవాలని కోరుతున్నానని ఆమే అన్నారు.

# నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 14 (వార్తాప్రభ):** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో శ్రీశ్రీశ్రీ ఆదిశక్తి పోచమ్మ తల్లి, కనకదుర్గమ్మ ఆలయ 24వ వార్షికోత్సవంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు.సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, కిషన్‌రావు, కుమారస్వామి, విఘ్నేశ్వరరెడ్డి, మల్లేష్, లక్ష్మణ్, ధర్మారెడ్డి, వెంకటేశ్వరరావు, సుదర్శన్‌రాజు, శ్రీనివాసరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామం లో మహిళా సిబ్బందిచే "బతుకమ్మ" సందడి





**శేరిలింగంపల్లి,అక్టోబర్ 14 (వార్తాప్రభ):**మాదాపూర్ శిల్పారామంలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి, సందర్శకులతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు.మరోవైపు గిరిజన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించే ఆదివాసీ మేళాను శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు ఐఏఎస్ ప్రారంభించారు.వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజనులు తమ ఉత్పత్తులను ప్రదర్శన, విక్రయానికి అందుబాటులో ఉంచారు.ఈ సందర్భంగా నాట్యగురువు ప్రమోద్‌రెడ్డి శిష్య బృందానికి చెందిన సుమారు 60 మంది కళాకారులు భరతనాట్యంలో 'దేవి కీర్తన మాలిక', 'దేవి వైభవం' అంశాలను ప్రదర్శించారు.అభినయంతో అమ్మవారి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

# విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే..

## జీతంలో 20శాతం కోత



ఢిల్లీ : బహుభార్యత్వం నిషేధం దిశగా కీలక చర్యలు చేపడుతోన్న అస్సాం ప్రభుత్వం.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో కోత పెట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం ఈ కీలక ప్రకటన చేశారు. "ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే.. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. సదరు ఉద్యోగి జీతం నుంచి 20శాతం కోత విధించి.. ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తాం. అయితే, ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది" అని సీఎం హిమంత వెల్లడించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తికాకుండానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా.. జీతంలో కోత కొనసాగుతుందని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎదురుచూడకుండా మొదటి భార్యకు ఆర్థిక సహకారం అందించాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల వేతనంలో 10శాతం కోత విధించనున్నట్లు హిమంత తెలిపారు.

## బాలికను అసభ్యంగా తాకిన రోబో.. షాకింగ్ ఘటన

16 ఏళ్ల బాలికను ఓ రోబో అనుచితంగా తాకడం తీవ్ర కలకలం రేపింది. జర్మనీ లోని కొలోన్ నగరంలో గత వారాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళల వద్దకు ఓ రోబో వచ్చి.. వారిని ఆలింగనం చేసుకోవడంతో పాటు ఓ అమ్మాయిని అసభ్యంగా తాకింది. ఈ ఘటనను ఇద్దరు టీనేజీ యువకులు సోషల్ మీడియా లైవ్‌లో ప్రసారం చేయడం గమనార్హం. రోబో యజమానిగా భావిస్తున్న ఓ 16 ఏళ్ల బాలుడు, అతడి స్నేహితుడు ఉద్దేశపూర్వకంగా దాన్ని నియంత్రిస్తూ ఈ ప్రవర్తనకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

# చైర్‌పర్సన్ రేసులో సునీత?



-'త్యాగాల పల్లపోతు' కుటుంబానికి టీడీపీలో గుర్తింపు దక్కేనా?



- పల్లపోతు కృష్ణ పార్టీ సేవలు ఒకవైపున
- కుమార్తె రాజకీయ అవకాశం మరోవైపు
- ఆ ప్రస్థానానికి కొనసాగింపు లభించేనా
- టీడీపీలో సునీత అభ్యర్థిత్వంపైనే చర్చ
- సేవా నేపథ్యానికి ప్రాధాన్యమిస్తారా?
- టీడీపీ బలోపేతం లక్ష్యంగా ప్రయాణం
- పదవుల కంటే సిద్ధాంతాలకైతే పెద్దపీట
- ఉమ్మడి కృష్ణాజిల్లాకు కార్యదర్శి సేవలు
- గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో మమేకం
- కష్టసుఖాల్లోను పాలుపంచుకున్న నేత
- పార్టీ కార్యక్రమాలే ప్రథమ ప్రాధాన్యం
- టీడీపీ దృష్టికైతే తీసుకెళ్లడంలో చొరవ
- తుదిశ్వాస వరకు తెలుగుదేశం కోసమే
- నందివాడ సర్పంచ్‌గానే ప్రత్యేక ముద్ర
- చంద్రబాబు ప్రశంసల ఉత్తమ కార్యకర్త
- రాజకీయ అవకాశం కంటే పార్టీ సేవలకే
- నేడు రాజకీయ గుర్తింపు దక్కుతుందా
- హైకోర్టు అడ్వకేట్'గా ప్రత్యేక గుర్తింపు
- పలు బ్యాంకులకు న్యాయ సలహాదారు
- మహిళా సంఘాలతోనూ సాన్నిహిత్యం
- సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం
- ఈ అర్హతల నేపథ్యంలోనే రేసులో పేరు
- ప్రజాజీవితంతో ముడిపడిన కుటుంబం
- బీసీ సంఘాలతో రాజాకు అనుబంధం
- జనసేన పార్టీలో నేతగా పల్లెబాట రాజా
- కాకొల్లు భస్మాకరరావు అడుగుజాడల్లో
- టీడీపీ అభ్యర్థిగా సునీతకు కల్పిస్తారా?
- పార్టీ సేవలా.. గెలుపు సమీకరణాలా..
- సునీతకు చైర్‌పర్సన్ రేసులో ఛాన్స్‌నా?
- టీడీపీ అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ

**గుడివాడ,అక్టోబర్ 14 (వార్తాప్రభ)** :తెలుగుదేశం పార్టీ కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడి కుటుంబానికి రాజకీయంగా గుర్తింపు దక్కుతుందా? దశాబ్దాలపాటు కార్యకర్తలే కుటుంబంగా, పార్టీ సేవే జీవితాశయంగా సాగిన పల్లపోతు వెంకట కృష్ణారావు రాజకీయ ప్రస్థానానికి కొనసాగింపు లభిస్తుందా? గుడివాడ మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ఇప్పుడు ఈ ప్రశ్నలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పల్లపోతు వెంకట కృష్ణారావు కుమార్తె, హైకోర్టు న్యాయవాది కొలుసు సునీత పేరు టీడీపీలో చైర్‌పర్సన్ రేసులో వినిపిస్తుండటంతో ఆసక్తి నెలకొంది. ఒకవైపు పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడి సేవలు.. మరోవైపు న్యాయ-వాదిగా, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామిగా కొనసాగుతున్న సునీత నేపథ్యం.. ఇంకోవైపు ఆమె భర్త పల్లెబాట రాజాకు బీసీ సంఘాలతో ఉన్న సాన్నిహిత్యం.. ఇవన్నీ ఈ చర్చలో ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే, సునీత అభ్యర్థిత్వంపై ఆ పార్టీ నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తెలుగుదేశం పార్టీ ప్రస్థానంలో పల్లపోతు వెంకట కృష్ణారావుది అంకితభావంతో కూడిన ప్రత్యేక స్థానం. ఉమ్మడి కృష్ణాజిల్లా టీడీపీ కార్యదర్శిగా పనిచేసిన ఆయన, పార్టీ బలోపేతం కోసం గ్రామగ్రామాన తిరుగుతూ కార్యకర్తలతో మమేకమయ్యేవారు. తన వ్యక్తిగత పనులకంటే పార్టీ కార్యక్రమాలకే ప్రాధాన్యమిస్తూ, కార్యకర్తల సమస్యలను తెలుసుకుని నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం తన బాధ్యతగా భావించేవారు. ఉదయాన్నే భోజనం సిద్ధం చేసుకుని ఏదో ఒక గ్రామానికి బయలుదేరడం, అక్కడి కార్యకర్తలతో మాట్లాడటం, వారి కష్టసుఖాల్లో భాగస్వామి కావడం ఆయన దినచర్యలో భాగంగా ఉండేదని పార్టీ వర్గాలు గుర్తుచేసుకుంటాయి. పార్టీ కోసం తుదిశ్వాస వరకు పనిచేసిన నిబద్ధత కలిగిన నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. నందివాడ మండల కేంద్రానికి సర్పంచ్‌గా పనిచేసిన పల్లపోతు వెంకట కృష్ణారావు, పార్టీ పట్ల తనకున్న అంకితభావంతో ఉత్తమ కార్యకర్తగా అప్పటి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రశంసలు పొందినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. పదవుల కోసం కాకుండా పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసిన ఆయన రాజకీయ జీవితం, కార్యకర్తలతో ఏర్పరచుకున్న అనుబంధం ఇప్పటికీ ఆయన కుటుంబానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నాయి. రాజకీయంగా ఎన్నో అవకాశాలు వచ్చినా పార్టీనే ప్రధానంగా భావించిన ఆ కుటుంబానికి ఇప్పుడు తగిన గుర్తింపు లభిస్తుందా అన్న ప్రశ్న ముందుకొస్తోంది. అదే కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన కొలుసు సునీత హైకోర్టు న్యాయవాదిగా తన వృత్తిలో కొనసాగుతున్నారు. పలు బ్యాంకులకు న్యాయ సలహాదారుగా వ్యవహరిస్తున్న ఆమె, మహిళా సంఘాలతోనూ సంబంధాలు కొనసాగిస్తున్నారు. మహిళలకు ఎదురయ్యే సమస్యలు, వాటికి సంబంధించిన న్యాయపరమైన అంశాలపై సలహాలు అందించడం, స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సామాజిక రంగంలోనూ తనదైన పాత్ర పోషిస్తున్నారు. న్యాయ పరిజ్ఞానం, మహిళా సంఘాలతో పరిచయాలు, కుటుంబ రాజకీయ నేపథ్యం.. ఈ అంశాల నేపథ్యంలో ఆమె పేరు టీడీపీలో మున్సిపల్ చైర్‌పర్సన్ రేసులో చర్చకు వస్తోంది. సునీత అత్త కొలుసు లక్ష్మి నందివాడ మండలం దండిగానపూడి సర్పంచ్‌గా పనిచేసిన నేపథ్యం కూడా ఈ కుటుంబానికి స్థానిక రాజకీయాలతో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తోంది. ఒకే కుటుంబంలో వేర్వేరు తరాలకు చెందిన వారు గ్రామస్థాయి ప్రజాజీవితంలో భాగస్వాములుగా ఉండటం, పార్టీతో దీర్ఘకాలిక సంబంధాలు కొనసాగడం ఈ కుటుంబ నేపథ్యంలోని ప్రధాన అంశాలు. ఇప్పుడు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో టీడీపీ నుండి సునీతకు అవకాశం కల్పిస్తారా అన్న చర్చకు ప్రాధాన్యం ఏర్పడింది. సునీత భర్త కొలుసు నాగరాజా అలియాస్ పల్లెబాట రాజాకు బీసీ సంఘాలతో ఉన్న అనుబంధం కూడా ఈ పరిణామాల్లో ప్రస్తావ-నకు వస్తోంది. సుమారు మూడు దశాబ్దాలుగా 'పల్లెబాట' పత్రిక సంపాదకుడిగా కొనసాగుతున్న ఆయన, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో చురుకుగా వ్యవహరిస్తూ వచ్చారు. రెండు దశాబ్దాల క్రితమే బీసీ సంఘాలను సమన్వయం చేయడంలో కీలకంగా వ్యవహరించారని ఆయనతో సన్నిహితంగా ఉన్నవారు చెబుతున్నారు. వివిధ బీసీ సంఘాల నాయకులతో పరిచయాలు, సామాజిక అంశాలపై చర్చలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేసిన ప్రయత్నాలు ఆయన ప్రజాజీవితంలో భాగంగా నిలిచాయి. న్యాయవాదిగా కూడా కొనసాగుతున్న పల్లెబాట రాజా ప్రస్తుతం జనసేన పార్టీ నాయకుడిగా ఉన్నారు. ఆయన తల్లి కొలుసు లక్ష్మి, మామ పల్లపోతు వెంకట కృష్ణారావు సర్పంచ్‌లుగా పనిచేసిన నేపథ్యం ఆయనకు గ్రామీణ రాజకీయాలపై అవగాహన కల్పించిన అంశాలుగా కనిపిస్తున్నాయి. టీడీపీతో కుటుంబానికి ఉన్న పాత అనుబంధం, ప్రస్తుతం కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేనలో ఆయన పాత్ర, బీసీ సంఘాలతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం.. ఈ మూడు అంశాల నేపథ్యంలో సునీత పేరుపై జరుగుతున్న చర్చకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. అయితే, ఈ పరిచయాలు ఎన్నికల సమయంలో ఎంతవరకు ప్రభావం చూపుతాయనేది స్థానిక పరిస్థితులు, పార్టీ నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. కాగా, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సన్నిహితుడు, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్మాకరరావు ప్రధాన అనుచరుడిగా, ఆయన అడుగుజాడల్లోనే పల్లెబాట రాజా నడుస్తుండడం విశేషం. గత అసెంబ్లీ ఎన్నికల్లోను వీరిద్దరి కాంబినేషన్ మంచి ఫలితాల్ని అందుకుంది. ఇదిలా వుంటే, గుడివాడ మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత రెండు దశాబ్దాలుగా పట్టణ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న నాయకత్వాలు, స్థానికంగా ఉన్న బలమైన రాజకీయ సంబంధాలు, అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు ఎన్నికల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇప్పుడు రిజర్వేషన్ మార్పుతో మహిళా నాయకత్వానికి అవకాశం ఏర్పడటంతో కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో న్యాయవాద వృత్తి, సామాజిక అనుబంధాలు, రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన సునీతకు టీడీపీ నుండి అవకాశం కల్పిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మంత్రి కొడాలి నాని బీసీ మహిళా అభ్యర్థిని రంగంలోకి దింపే వ్యూహంపై దృష్టి సారిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆయన బలపరిచిన అభ్యర్థులు సాధించిన విజయాలు గుడివాడ రాజకీయాల్లో ఆయన ప్రభావాన్ని చాటాయని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో కూటమి తరఫున అభ్యర్థి ఎంపిక కీలకంగా మారనుంది. సామాజిక సమీకరణాలు, స్థానిక పరిచయాలు, పార్టీ పట్ల నిబద్ధత, ప్రజా సమస్యలపై అవగాహన.. వీటిలో ఏ అంశానికి అధిష్ఠానం ప్రాధాన్యం ఇస్తుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. పల్లపోతు వెంకట కృష్ణారావు చేసిన పార్టీ సేవలకు గుర్తింపుగా ఆయన కుటుంబానికి అవకాశం కల్పించాలన్న అభిప్రాయం ఒకవైపు వినిపిస్తుండగా, ఎన్నికల్లో గెలుపునకు అవసరమైన అన్ని అంశాలను పరిశీలించి అభ్యర్థిని నిర్ణయించాలన్న వాదన మరోవైపు ఉంది. సునీతకు అవకాశం లభిస్తే అది ఆమె రాజకీయ ప్రస్థానంలో కొత్త అధ్యాయానికి నాంది కావడంతోపాటు, పల్లపోతు కుటుంబానికి రాజకీయంగా గుర్తింపు లభించినట్లుగా భావించే వర్గాలు ఉండవచ్చు. అదే సమయంలో, పార్టీ అధిష్ఠానం నిర్ణయంలో స్థానిక రాజకీయ పరిస్థితులు, కూటమి సమన్వయం, అభ్యర్థి ఎంపికకు సంబంధించిన ఇతర అంశాలు కీలకంగా మారనున్నాయి. గుడివాడ మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం జరగనున్న పోటీ నేపథ్యంలో ఇప్పుడు అందరి చూపు అభ్యర్థుల ఎంపికపైనే ఉంది. టీడీపీ కోసం జీవితాన్ని అంకితం చేసిన పల్లపోతు వెంకట కృష్ణారావు కుటుంబానికి రాజకీయ గుర్తింపు దక్కుతుందా? హైకోర్టు న్యాయవాది కొలుసు సునీతకు చైర్‌పర్సన్ రేసులో ముందడుగు వేసే అవకాశం లభిస్తుందా? బీసీ సంఘాలతో పల్లెబాట రాజాకు ఉన్న అనుబంధం, కుటుంబ రాజకీయ నేపథ్యం ఈ ఎంపికలో ప్రస్తావనకు వస్తాయా? అన్న ప్రశ్నలకు టీడీపీ అధిష్ఠానం నిర్ణయమే సమాధానం చెప్పనుంది.

# ప్రకృతి అందాల నడుమ 'అతిశయ లేక్ వ్యూ' ప్రారంభం

- మంత్రి కొలుసు పార్థసారథి, సినీ నటుడు మురళీమోహన్, రాజా రవీంద్ర, శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హాజరు



**ఆగిరిపల్లి,అక్టోబర్ 14 (వార్తాప్రభ)** : ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో శ్రీ నిలయ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అతిశయ లేక్ వ్యూ' వెంచర్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. సంస్థ అధినేత అమర్నేని వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ప్రముఖ సినీ నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్, నటులు రాజా రవీంద్ర, శ్రీనివాస్ రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూమిపూజ నిర్వహించి వెంచర్‌ను ప్రారంభించారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలం ప్రకృతి అందాలకు నిలయమని, బ్రహ్మలింగ చెరువు, చుట్టూ ఉన్న కొండలు ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని తెలిపారు. గన్నవరం విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో రిసార్టులు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణానికి మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పర్యాటకులకు ఆహ్లాదకరమైన వసతులు కల్పించడం ద్వారా స్థానికంగా పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని అన్నారు. సినీ నటుడు మురళీమోహన్ మాట్లాడుతూ భూమిపై పెట్టుబడి పెట్టడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. అతిశయ లేక్ వ్యూ పరిసరాల్లోని ప్రకృతి అందాలు, ప్రశాంతమైన వాతావరణం తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.

# శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలి - మంత్రి కొలుసు పార్థసారథి



**ఆగిరిపల్లి,అక్టోబర్ 14 (వార్తాప్రభ)** : ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం అమ్మవారిగూడెం గ్రామంలో శ్రీ శ్రీ గంగానమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు పునాదులని, వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ప్రేమ, ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. రాష్ట్ర ప్రజలంతా అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని గంగానమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మోగిన స్థానిక సంస్థల ఎన్నికల నగారా....!

## స్థానిక ఎన్నికల షెడ్యూల్ రిలీజ్

**మైలవరం/జి.కొండూరు,అక్టోబర్ 14 (వార్తాప్రభ)** : ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది.రాష్ట్ర ఎన్నిక ల సంఘం అక్టోబర్ 14, 2026న షెడ్యూల్ రిలీజ్ చేసింది.మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈ మేరకు వివరాలు వెల్లడించారు.మొత్తం మూడు దశల్లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు.తొలుత 100 అర్బన్ బాడీస్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 పురపాలక సంఘాలు, 10 నగర పంచాయతీలకు తొలుత ఎన్నికలు జరగను న్నాయి. ఈ నెల 16వ తేది నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. 19న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు.26తో ఎన్నికల ప్రచారం ముగియనుంది.ఈ నెల 28న పోలింగ్, 30న ఫలితాలు వెల్లడించనున్నారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది.

**నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు..** రెండో దశలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.ఈ నెల 19న నోటి ఫికేషన్ విడుదల చేయనున్నారు. నామినేషన్లు ఈ నెల 23 వరకు స్వీకరించనున్నారు.24న నామినేషన్ల పరిశీలన, 27న ఉపసంహరణకు గడువు ఇచ్చారు. నవంబర్ 3న పోలింగ్ నిర్వహించి,నవంబర్ 5న ఫలితాలు వెల్లడించనున్నారు.

**మూడు దశల్లో పంచాయతీలకు.....** మూడో దశలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.నవంబర్ 13న నోటిఫికేషన్ విడుదల చేస్తారు.నవంబర్ 26న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు. రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు నవంబర్ 16న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

నవంబర్ 29న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాల ప్రకటించనున్నారు.మూడో దశ ఎన్నికలకు నవంబర్ 19న నోటిఫికేషన్ విడుదల చేసి డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్ల ఫలితాలను ప్రకటించనున్నారు. మిగిలిన 23 అర్బన్ లోకల్ బాడీలకు సంబంధించి కోర్టు ఉత్తర్వులు వచ్చిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తామని ఎస్ఈసీ వెల్లడించా రు.

**మైలవరం, జి.కొండూరు మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఖరారైన రిజర్వేషన్లు:** మైలవరం, జి కొండూరు మండలాలకు సంబంధించి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి.మైలవరం ఎంపీపీ స్థానాన్ని బిసి మహిళ కు కేటాయించగా, జడ్పిటిసి స్థానాన్ని ఎస్టీ కి కేటాయించడం జరిగింది.అలాగే జి కొండూరు మండలానికి సంబంధించి ఎంపీపీ స్థానాన్ని ఎస్సీ కి కేటాయించగా, జడ్పిటిసి స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించారు.రిజర్వేషన్లు కూడా ఖరారు కావడంతో అభ్యర్థుల ఎంపికలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు కసరత్తు చేస్తున్నారు.

# విజ్ఞాన పరిశోధనలు, ఆవిష్కరణల్లో విశేష ప్రతిభ కనబరిచిన అధ్యాపకులకు గుర్తింపు







**మైలవరం,అక్టోబర్ 14 (వార్తాప్రభ)** : జాతీయ ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉత్తమ పరిశోధకుల అవార్డులకు 11 మంది అధ్యాపకులు ఎంపికైనట్లు స్థానిక లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పరిశోధన మరియు అభివృద్ధి విభాగం (Research and Development Cell) బుధవారం ప్రకటించింది. పరిశోధనా ప్రచురణలు, పరిశోధనా ప్రాజెక్టులకు నిధుల సాధన, పేటెంట్లు, విద్యా మరియు శాస్త్రీయ రంగాల అభివృద్ధికి చేసిన విశేష కృషిని గుర్తిస్తూ ఈ అవార్డులను ప్రదానం చేశారు.ఈ అవార్డులకు డా.దివ్వెల శ్రీనివాసరావు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్)డా.పి.లోవరాజు (ఏరోస్పేస్ ఇంజినీరింగ్),డా. కె.వెంకట రమణ ( సివిల్ ఇంజినీరింగ్),డా. శీలం నాగార్జున రెడ్డి(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్), డా. షేక్ సల్మా ఆసియా బేగం(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్), డా.జి.శ్రీనివాసులు (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్), డా.జి.నాగేశ్వరరావు(ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ),ఎం.విజయ్ కుమార్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), డా.వల్లపూడి ధనరాజు(మెకానికల్ ఇంజినీరింగ్), డా.డి. వెంకటేశ్వర్లు(మేనేజ్‌మెంట్ స్టడీస్ ),డా.టి. సత్యనారాయణ (ఫండమెంటల్ ఇంజినీరింగ్ విభాగం ),డా. బి. సుధీర్ కుమార్(మెకానికల్ ఇంజినీరింగ్),డా.కె రాణి రుద్రమ(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్), ఎంపిక అయ్యారు.ఈ సందర్భంగా పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి ఈ అవార్డులకు ఎంపికైన అధ్యాపకులందరికీ కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు మరియు డీన్ ఆర్ అండ్ డి డా.ఎస్.పిచ్చి రెడ్డి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని పరిశోధనా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# పెడన జడ్పిటిసి వైసిపి అభ్యర్థిగా రాజులపాటి వాణి



**పెడన,అక్టోబర్ 14 (వార్తాప్రభ)** : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం వైసిపి మరో కీలక నిర్ణయం తీసుకుంది.ఇప్పటికే ఎంపీపీగా గరికపాటి రామానాయుడును ప్రకటించిన వైసిపి జడ్పిటిసి సభ్యురాలిగా రాజులపాటి వాణి అచ్యుతరావు ని నిర్ణయించారు. వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి ఉప్పాల రాము బుధవారం రాత్రి ముఖ్య నాయకులతో పెడనలోని పార్టీ కార్యాలయం లో సమావేశమై వారి అభిప్రాయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.మండల పరిధిలోని గురివిందగుంట గ్రామానికి చెందిన వాణి అచ్యుతరావు ఎంపీపీ గా బాధ్యతలు నిర్వహించారు.జడ్పీటీసీ పదవి బీసీ మహిళకు కేటాయించారు. ఈ నేపథ్యంలో వాణి ని అభ్యర్థిగా నిర్ణయించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188